ఆదివారం
ప్రజాశక్తి
జూన్ 13, 2004

టూరిస్ట్ గైడ్



మళ్లీ బడికి.....

హ్యాపీ బర్త్‌డే

(13-6-2004 నుండి 19-6-2004 వరకు)

పి.సాయిదీపక్
3సం॥, 14.6.2001
ఆశాజ్యోతి-బాబూరావు
పూండి-శ్రీకాకుళం

రాకేష్‌చంద్(బంటి)
3సం॥, 15.6.2001
భారతి-వెంకట్
చీమకుర్తి-ప్రకాశం

మనోజ్‌కుమార్
2సం॥, 16.6.2002
లక్ష్మీప్రభ-రామాంజయ్య
మాధవధార-విశాఖ

పి.ప్రణీత్‌రాజ్
10సం॥, 16.6.1994
రోజారాజ్-అశోక్‌రాజ్
రామచంద్రాపురం-మెదక్

కె. చంద్రవంశీ
3సం॥, 17.6.2001
రాజ్యలక్ష్మి-వీరయ్య
ముషీరాబాద్-హైదరాబాద్

భానుప్రకాష్
1సం॥, 18.5.2003
స్వప్న-రాంబాబు



షోయబ్
జూన్-19
నుస్రత్-ఖాజామియా
ఆకుపాముల-నల్లగొండ



సమద్
1సం॥, 19.6.2003
బీబీజబిరియ-రహమాన్
చల్లపల్లి-కృష్ణా

లలిత్ ఆనంద్
9సం॥, జూన్-1995
విజయకుమారి-రాములు
అనంతవరం-ప్రకాశం

విశ్వతేజని
అపర్ణమ్మ-అంజిరెడ్డి
మదమనూరు-నెల్లూరు

లతీఫ్
సాజీదా-ఖాదర్‌బాషా
కలికిరి-చిత్తూరు

గమనిక: పదేళ్ళ వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 1-1-298/4 ,
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.



లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



నయనార్‌కు విప్లవాభినందనలు

మే 30 ఆదివారం అనుబంధంలో అమరజీవి నయనార్ జీవిత విశేషాలతో కూడిన వ్యాసం నన్నెంతో ఆకర్షించింది. సామ్యవాద సిద్ధాంతాలను నమ్మిన వారెందరో మానవజాతి ఉజ్వల భవిష్యత్ కొరకు సాగిన, సాగుచున్న పోరాటాలలో తమ జీవితాలను అర్పించిన మహనీయులెందరో ఉన్నారు. వారిలో నయనార్ ఒకరు. ఆయన పసితనం నుండీ జీవితాంతం అవిశ్రాంతంగా సామ్యవాద పోరాటాలలో పాల్గొన్న ధన్యజీవి. మానవజాతి ఉన్నతి కొరకు సాగే మహత్తర పోరాటాలలో తమ జీవితాలనర్పించిన మహనీయుల త్యాగమయ జీవితాల గురించి, ప్రతి ఆదివారం ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో ప్రచురిస్తున్నందుకు అభినందనలు. పుచ్చలపల్లి సుందరయ్య, నయనార్ వంటి విప్లవయోధుల జీవితాదర్శాలు, వర్తమాన సామ్యవాద ఉద్యమాలలో పని చేయుచున్న యువకులకు ఎంతో స్ఫూర్తినిచ్చి మార్గదర్శకాలవుతాయి.

- గొట్టుముక్కల నరసింహరాజు,
సికింద్రాబాద్.

రియల్ స్టోరీ బాగుంది

30 మే 2004 ఆదివారం ప్రజాశక్తి అనుబంధంలో రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన దూసుకుపోతున్న రైలు దేశంలోనే మొదటి మహిళా డ్రైవర్‌గా సులేఖ యాదవ్ కీర్తి గడించడం నిజంగా డ్రైవర్ వృత్తికే గర్వకారణంగా నిలిచిపోవడం చాలా ఆనందంగా వుంది. పత్రికా విలేకరులు అడిగే ప్రశ్నలకు వినమ్రంగా, వినయంగా, ఏ మాత్రం సంకోచం లేకుండా సూటిగా జవాబు చెప్పడం ఒక్క సులేఖా యాదవ్‌గారికే చెందుతుంది అని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదనిపిస్తోంది.

- మేడూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

ఔరా అనిపిస్తోంది

ఔరా శీర్షికలో ఇస్తున్న అంశాలు నిజంగానే ఔరా అనిపిస్తున్నాయి. మే 30వ తేదీన ప్రచురించిన శునక వీర్యకేంద్రం సమాజంలో పెరుగుతున్న సంపదకు, పొగ కేంద్రాలు పాశ్చాత్య ఆధునిక సమాజంలో వస్తున్న మార్పులకు సంకేతాలు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఇటువంటి సంఘటనల గురించి మాకు అందిస్తున్న



ప్రజాశక్తికి అభినందనలు. ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో ప్రచురిస్తున్న అన్ని అంశాలు ఆసక్తికరంగా ఉంటున్నాయి.

- ఎన్. మధుసూధనరావు,
వనస్థలిపురం, హైదరాబాద్

- వి. ఈశ్వరరావు,
మొగల్రాజపురం, విజయవాడ

ఇంకా పొద్దుపొడవలేదు

మే 30వ తేదీ ఆదివారం అనుబంధం సంచికలో ప్రచురించిన ముదిగంటి సుజాతారెడ్డిగారి 'ఇంకా పొద్దు పొడవలేదు' కథ చాలా బాగుంది. పురుషాధిక్య సమాజంలో ఆడపిల్లలకు ఇంటిలోనే ఎదురవుతున్న సమస్యలను, వారిని బందిఖానాలో పెడుతున్నట్లుగా పెంచడం వంటి అనేక సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఒక ఆధునిక యువతి పట్ల ఆమె తండ్రి ప్రవర్తించిన తీరు బాగా వర్ణించారు. ఇటువంటి పరిస్థితులు అంతటా ఉన్నదే. మనుషుల ఆలోచనలు మారనిదే ఆధునికత వచ్చినట్లు కాదు.

- కె. సువర్ణ, మచిలీపట్టణం

మనలో మాట

నో కామెంట్!

ఎందుకు ఏమిటి అనేవి ప్రశ్నలు!

సమస్తమైన ప్రశ్నలకు సమాధానాలుండవు!

అంచేత -

అడిగిన ప్రశ్న అర్థం కానప్పుడు - ఎంత గింజుకున్నా సమాధానం దొరకదు. ప్రశ్న అర్థం కాలేదని చెబితే మన 'విషయ పరిజ్ఞానం' నవ్వుల పాలవుతుందనే భయంతో మనం ఉపయోగించే పదం పేరు - నోకామెంట్!

ప్రశ్న బాగా అర్థమైనా సమాధానం చెప్పడం ఇష్టం లేనప్పుడూ... అభ్యంతరమైనప్పుడూ మనమిచ్చే సమాధానం - నో కామెంట్!

కొన్ని దిక్కుమాలిన ప్రశ్నలకు వళ్ళు మండిపోతుంది!

అడిగిన వాణ్ని చెప్పుచ్చుక్కొట్టాలనిపిస్తుంది!

కొడితే తప్పవుతుంది గనక...

కొట్టినంత కోపంతో - నో కామెంట్ అనే అంటాం!

చిలిపి ప్రశ్నలు కొన్నిటికి సరదాగా నవ్వేస్తాం. అడిగిన మనిషి భుజమ్మీద భళాభళీ అనే టైపులో తాళం వేస్తాం. ఆనక - నో కామెంట్ అని బుజ్జగిస్తాం!

అడిగేవాడికి -

చెప్పేవాడు లోకువ అని లోకోక్తి!

అందువల్ల -

అడిగేవాళ్ళు అనేకం అడుగుతుంటారు!

అడిగిన ప్రతి చెత్త ప్రశ్నకీ ఓపిగ్గా సమాధానం చెప్పుకుంటూపోతే మన కొంప మునుగుతుంది!

అనవసరంగా ఇబ్బందుల్లో ఇరుక్కుపోతాం!

కనిపించని కష్టాలు కొన్ని తగులుకుంటాయి!

సమాధానం చెప్పినట్టూ వుండాలి చెప్పకుండానూ వుండాలి అనే సూత్రం పేరు - నోకామెంట్!

ప్రశ్నలకు సమాధానాలుగా ఎంత విరివిగా 'నోకామెంట్లు' వినిపిస్తే ఆ పెద్ద మనిషి అంత ఇరకాటంలో వున్నాడని తెలుసుకోవాలి!

సదరు సమస్యల పరిష్కారాలు శ్రీవారి చేతుల్లో లేవని గమనించాలి!

అవన్నీ పై వాళ్ళే చూసుకుని తేల్చుకుంటారనే ధోరణికి కట్టుబడి వున్నాడని అర్థం చేసుకోవాలి!

అంతకుమించి -

నోకామెంట్!

ఈ సంచికలో . . .

ఓరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 6
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

కాళ్లప్పన్న

కథ ... 9

సారాసురమర్ధిని

రియల్‌స్టోరి ...14, 15



హైటెక్ సిటీ హైదరాబాద్

టూరిస్ట్‌గైడ్...21

రంగస్థల ఫోకస్ లైట్ గరిమెళ్ళ రామ్మూర్తి

కళాసాహితి . . . 22, 23

నీటి ఏనుగు స్వేదంతో యాంటీబయాటిక్?!

ఇటీవల చర్య సౌందర్యం కాపాడుకోవడానికి రకరకాల ఆయింట్‌మెంట్లు, లోషన్లు, పౌడర్ల వాడకం పెరిగిపోయింది. యువతీ, యువకులు ఆయా కంపెనీల ప్రకటనల మోజులో పడి కాలానికి అనుగుణంగా చర్యసౌందర్యానికి మందులు వాడుతున్నారు. అవన్నీ రసాయనాలతో తయారుచేసినవి కావడంతో చర్మాన్ని రక్షించడానికి బదులుగా కొన్ని రకాల వ్యాధులను కూడా కలుగుచేస్తున్నాయి. అందుకే సహజసిద్ధమైన రక్షక మందులు కావాలని ఆరాటపడుతున్నారు. నీటి ఏనుగు స్వేదంలో సహజసిద్ధమైన యాంటీబయాటిక్, సూర్యకాంతి నుండి రక్షించే సన్‌స్క్రీన్ ఉందని జపాన్ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. లేత ఎరుపు రంగు నుండి క్రమంగా గోధుమరంగులోకి మారే ఈ స్వేదం వంటికి పూసుకుంటే ఇక ఆ చర్మ సౌందర్యానికి ఎటువంటి ఢోకా లేదని వారు చెబుతున్నారు. అయితే వాసన మాత్రం జంతు ప్రదర్శనశాలలో వచ్చే వాసనలా ఉంటుందట?!

స్టార్ మినిస్టర్



మనదేశంలో సినిమా తారలకు, క్రికెట్ తారలకు ఉన్నంత క్రేజీ మరెవ్వరికీ లేదు. కాంగ్రెస్ ఎంపీ సునీల్ దత్ కేంద్రంలో క్రీడాశాఖ మంత్రి అయ్యాక ఆయన కార్యాలయం సందర్శకులతో కిక్కిరిసిపోతోందట. సునీల్‌దత్ కుటుంబం అంతా తారలమయం కావడంతో ఆయనకు దగ్గర అయ్యేందుకు అధికారులు, సామాన్య ఉద్యోగులు.. ఇలా అన్నిరకాల వాళ్ళూ ఎంతో తపన పడుతున్నారని ఢిల్లీ సమాచారం. సునీల్‌దత్ కుమారుడు సంజయ్‌దత్ హిందీలో పెద్దస్టార్. కుమార్తెలు ప్రియ, నమ్రత, అల్లుడు కుమార్‌గౌరవ్ కూడా నటులే కావడంతో సునీల్‌దత్ కార్యాలయం ఏ మంత్రి కార్యాలయం కంటే రద్దీగా ఉంటోందట? ఇంత వెర్రి ఎందుకో?!

నీటి పోలీసులు

పోలీసుల్లో రకరకాల వాళ్ళను మనం చూస్తున్నాము.. శాంతిభద్రతలను కాపాడేవారు, ట్రాఫిక్ పోలీస్, క్రైం పోలీస్ ఇలా ఎన్నో రకాలు మనకు తెలుసు. అయితే ఆస్ట్రేలియాలో కొత్తగా నీటి పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేశారట! ఆ దేశ రాజధాని సిడ్నీ నగరం నీటి కొరతతో కటకటలాడిపోతోంది. అందుకే నీటి వాడకాన్ని చాలా కఠినంగా నియంత్రిస్తున్నారు. అక్కడ కార్లు కడగడానికే నీరు చాలా దుర్వినియోగం అవుతుందట. నీటి నియంత్రణా కమిటీ స్క్వాడ్ సిబ్బంది నగరంలోనూ, శివార్లలోనూ సంచరిస్తూ, కార్లు కడగటానికి పైపులతో నీరు దుర్వినియోగం చేసేవారికి అప్పటికప్పుడే జరిమానా విధించి వసూలు చేస్తున్నారట! ఈ జరిమానా విలువ మన కరెన్సీలో ఎంతో తెలుసా? 7,480 రూపాయలు మాత్రమే.

కార్టూన్ కదంబం


చాల్లే... నువ్వు పట్టుపట్టి ఉంటే మేమంతా బతికి ఉండేవాళ్లం...
మోడీ రాజీనామా చేయాలని ఆరోజే చెప్పాను : బాబు


నీళ్ల చర్చలు కదా! బొకేనో, పూలదండో ఇస్తే మరిచిపోతారేమోనని...
కావేరి

శవపేటికల కుంభకోణాల్లో ఉన్న వాళ్లు మాత్రమే మంత్రులుగా ఉండొచ్చు, నేరచరితులు ఉండరాదు...
నారు

కావలెను...

సరళంగా ఇంగ్లీషు మాట్లాడటం తెలుసా మీకు?

ఉద్యోగ ప్రకటనలలోను, ఇంటర్వ్యూలలోను ఇలాంటి ప్రశ్న ఉండటం మీరు గమనించే ఉంటారు.

'Yes' అంటే ఆ ఉద్యోగం మీకే !

కావలసిన విద్యార్హతలు, అనుభవం ఉన్నప్పటికీ ఇంగ్లీషు మాట్లాడలేని ఒకే కారణంవల్ల మీకు వచ్చిన అవకాశాలు జారవిడవకండి.

మీ తీరిక వేళలో ప్రతిరోజు అరగంట సమయం కేటాయించి వివేకానంద ఇన్‌స్టిట్యూట్ అందించే సులభమైన శిక్షణ ద్వారా సరళంగా ఇంగ్లీషులో మాట్లాడటం నేర్చుకోండి.

ఇప్పటికి 16 లక్షలకు పైబడినవారు ఈ శిక్షణ మూలంగా ప్రయోజనం పొందారు.

మీరు కూడా ఈ ప్రయోజనం పొందటానికి క్రింద ఉన్న కూపన్ పూర్తిచేసి ఈ రోజే పంపించండి. శిక్షణకు కావలిసిన పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్‌వద్ద **రూ. 575/-** చెల్లించి తీసుకోండి.

రోజూ అరగంట ప్రాక్టీసు చేయండి. తడబడకుండా ఇంగ్లీషులో మాట్లాడండి.

WANTED

For a reputed company in Vijayawada

MANAGER
RECEPTIONISTS
OFFICE ASSISTANTS

Experienced / Fresh Candidate with good academic back-grou... fluency in English a... knowledge of computer ma... apply to ... Patamata,Vijayawada-520006.

(044) 24347034

నెంబరుకు ఫోన్ చేస్తే చాలు శిక్షణ పాఠాలు V.P.P. ద్వారా ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి.

—ఇదిగో కూపన్—

నేను ఇంగ్లీషులో సరళంగా మాట్లాడాలనుకుంటున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా పంపండి. పోస్టుమేన్‌కి **రూ. 575/-** చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

KPS

పేరు: ....

వయసు:........................ ఆడ ☐ మగ ☐

చిరునామా:...

....

.... పిన్‌కోడ్.......................................

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T. Nagar, Chennai-600017.

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (S.R.NAGAR ☎ 23714330. DILSUKHNAGAR ☎ 24044352. VANASTHALIPURAM ☎24122464. MEHDIPATNAM ☎55755888. A.S.RAO NAGAR ☎55497992. NARAYANAGUDA ☎55155441). RAJAMUNDRY ☎2422003. KAKINADA ☎2386638. VISAKHAPATNAM ☎2738892. VIJAYAWADA ☎5530053. GUNTUR ☎2238541. NELLORE ☎ 2327702. THIRUPATI ☎ 2252878. CUDDAPAH ☎ 224445. KARIMNAGAR ☎2234883. WARANGAL ☎2578946. MIRYALGUDA ☎230130. ANANTAPUR ☎ 241029. KURNOOL ☎248099. NIZAMABAD ☎235767. PRODDATUR ☎ 250550.

09/TEL/04/NAGA

మళ్ళీ బడికి...

నిన్నటి వరకు ఆట పాటలతో గడిపేసిన చిన్నారులు రేపటి నుండి మళ్ళీ బడికి వెళ్ళాలి. ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ళు తెరిచి ఇప్పటికే రెండు వారాలైంది. రేపటినుండి తెరిచేది ప్రభుత్వ పాఠశాలలు మాత్రమే. రాష్ట్రంలోని విద్యారంగానికి తొమ్మిదిన్నరేళ్ళుగా పట్టిన పీడ నెల రోజులనాడు విరగడైంది. అయినా ఇప్పటివరకు కాచిన విషఫలాలు అలాగే ఉంటాయి. ఇంతకాలం హైటెక్ హంగులు, ఆర్భాటాలతో సాగించిన ప్రచారం వల్ల రాష్ట్రంలోని పాఠశాల విద్యారంగం బాగుపడకపోగా మరింత భ్రష్టుపట్టిపోయింది. చదువు కొనగలిగేవారి కోసం విశాలమైన స్థలాల్లో, సువిశాలమైన భవనాలతో, కళ్ళు తిరిగే ఫీజులతో కార్పొరేట్ స్కూళ్ళ నిర్మాణం ఇటీవల బాగా పెరిగిపోయింది. పేదల కోసమే అన్నట్లుగా ఉన్న ప్రభుత్వ బళ్ళు యథా ప్రకారం అనాథల్లా మిగిలాయి. పునాది స్థాయిలో ఎటువంటి సౌకర్యాలు, మార్పులు తేకుండా మళ్ళీ బడికి, చదువుల పండగ, అక్షర సంక్రాంతి, అక్షర ఉగాది అంటూ అమలు చేసిన కార్యక్రమాల వల్ల అక్షరాస్యత పెద్దగా పెరగలేదు. 2001 లెక్కల ప్రకారం రాష్ట్రంలో అక్షరాస్యతా శాతం 70 వరకు ఉన్నా 2005 నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామని గత ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరే అవకాశం కనిపించడంలేదు.

ఇ. వి. బాలాజీ

అవే బడులు, అవే సమస్యలు.... పుస్తకాల కొరత, ఉపాధ్యాయుల కొరత, గ్రంథాలయం, లేబరేటరీలు ఎలా ఉంటాయో తెలియదు... ఆటపాటల్లేవు... మంచినీరు లేదు, మరుగుదొడ్లు లేవు, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న గదులు... రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఇది.. ఇప్పటికీ రాష్ట్రంలో సుమారు కోటిమంది బడి యీడు బాలలు పాఠశాల ముఖం చూడనివారే.. ఒకటవ తరగతిలో చేరిన పిల్లల్లో పదవ తరగతికి వెళ్లే సరికి మూడోవంతు కూడా మిగలడం లేదు.. ఉదాహరణకు గత మార్చిలో జరిగిన ఏడవ తరగతి పరీక్షలకు హైదరాబాద్‌లో 70 వేల మంది హాజరు కాగా పదవ తరగతికి హాజరైంది 52 వేలు మాత్రమే. పైగా హైదరాబాద్‌లో కార్పొరేట్ స్కూళ్ళకు ఇతర జిల్లాల నుండి కూడా పిల్లలు వచ్చి చేరుతారు. ఈ డ్రాపవుట్స్ పరిస్థితి రాష్ట్రమంతటా ఉంది. పేదరికం, నిరుద్యోగం, సామాజిక నేపథ్యమే దీనికి కారణమని వేరే చెప్పాల్సిన అవసరం లేదు.

ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో 80.41 శాతం

"సంస్కరణల ప్రభావంతో విద్య ఒక లాభసాటి వ్యాపారంగా మారిపోయింది. పాఠశాల విద్యా బాధ్యతల నుండి కూడా ప్రభుత్వాలు తప్పుకుంటున్నాయి. దీంతో పట్టణ ప్రాంత విద్యకు, గ్రామీణ విద్యకు పొంతన లేకుండా పోతోంది. బాలల భవిష్యత్‌కు పునాది వేసేది పాఠశాల విద్యే. అందుకే హైస్కూల్ వరకైనా కార్పొరేట్ సంస్థలను అనుమతించరాదు. ప్రభుత్వమే పూర్తి బాధ్యతలు స్వీకరించాలి" ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అభిప్రాయాలివి. పాఠశాల విద్యకు సంబంధించి ప్రజాశక్తి ఆదివారంకు ఆయన ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు...

పాఠశాల విద్యలో కార్పొరేట్ సంస్థలను అనుమతించరాదు

చుక్కా రామయ్య

ప్రస్తుత పాఠశాల విద్యపై మీ అభిప్రాయం?

గ్రామీణ విద్యకు, పట్టణ విద్యకు మధ్య పెద్ద అగాథం ఏర్పడింది. ప్రజల ఆర్థిక పరిస్థితుల వల్లే ఈ భావన కలుగుతోంది. గ్రామీణ ప్రాంతంలో పేదలుగా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి వర్గాల పిల్లలు మాత్రమే అత్యధికంగా మిగిలిపోయారు. కొద్దో గొప్పో ఉన్నటువంటి కుటుంబాలన్నీ పల్లెల్లో ఉంటూనే తమ పిల్లలను మాత్రం చదువు కోసం పట్టణాలకు పంపిస్తున్నారు. పట్టణాల్లో స్కూల్ చదువుల్లో కూడా కార్పొరేట్ సంస్థలు ప్రవేశించాయి. చదువు కంటే కూడా ఫలితాలు, మార్కులే ముఖ్యంగా మారిపోయాయి. విద్యలో ప్రాసెస్ (విధానం) ముఖ్యం, ప్రొడక్ట్ (ఉత్పాదన) ముఖ్యం కాదు. మార్కెట్ విధానంలో ప్రొడక్ట్ ముఖ్యం కాని ప్రాసెస్ ముఖ్యం కాదు. కార్పొరేట్ సంస్థల ప్రవేశం వల్ల విద్యలో కూడా వాణిజ్య విధానాల పెత్తనం కొనసాగు తోంది. ఇక పల్లెల్లో మిగిలిన పిల్లలు అంతగా చదువులేని కుటుంబాలనుండి వస్తున్నవారు కావడాన పిల్లలకు చదువు కోవాలన్న ఆసక్తి ఉన్నా వారి ఇళ్ళలో అటువంటి వాతావరణం ఉండటం లేదు. గ్రామాల్లోని స్కూళ్ళలో ఉపాధ్యాయులు సరిపడా ఉండరు. తెలుగు మాస్టారుతో సైన్స్ చెప్పిస్తారు. చదువులో పల్లెటూరి ప్రపంచం వేరు. పట్టణాల్లో దీనికి భిన్నమైన స్థితి ఉంది. తల్లిదండ్రులు చదువుకున్నవారు. చదువుపై ఆసక్తి చూపుతారు.

పట్టణాల్లో మార్కులు ఎలా సంపాదించాలో సులువైన మార్గాలు నేర్చుకున్నారు. పాఠశాల విద్య జీవితానికి పునాది. విద్యార్థి 15 సంవత్సరాల లోపు చదువే రాబోయే జీవితానికి పునాది. ముఖ్యంగా సైన్స్, లెక్కలపై అవగాహన ఉండవలసిన దశ అది. కాని దురదృష్టవశాత్తు సైన్స్‌ను సైన్స్ తీరుగా చెప్పడంలేదు. లెక్కలను పురాణాల తీరున చెబుతున్నారు. అందుకే పిల్లలకు సబ్జెక్టులపై అవగాహన కలగడం లేదు. దానివల్లనే పబ్లిక్ పరీక్షలో దండిగా మార్కులు వచ్చిన పిల్లలు కూడా పోటీ పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారు. అందుకే హైస్కూల్ విద్యను పునర్వ్యవస్థీకరించ కపోతే వచ్చే కాలంలో మనం అపహాస్యం పాలవుతాము.

కార్పొరేట్ సంస్థల వల్ల జరుగుతున్న నష్టం?

కార్పొరేట్ శక్తులు విద్యలో ప్రవేశించడం శోచనీయం. పాలకుల వైఫల్యం వల్లనే ఇది జరిగింది. విద్య వ్యాపారం కాదు, పాఠశాలలు కోచింగ్ సెంటర్లు కాదు, ఉపాధ్యాయుడు షాప్‌కీపర్ కాదు. టెక్స్ట్ పుస్తకాల కంటే గైడ్స్‌కు ప్రాధాన్యత ఇవ్వడం విద్యలో లోపానికి అద్దం పడుతోంది. ఇవన్నీ కార్పొరేట్ లక్షణాలు. కార్పొరేట్ సంస్థలు విద్యావ్యవస్థను శాసిస్తున్నాయి. విద్యతో సంబంధం లేని మేనేజర్ ఎంత పాఠం చెప్పాలి? ఎవరికి చెప్పాలి? ఎలా చెప్పాలి? అనే అంశాలను నిర్ణయిస్తున్నారు. పిల్లవాడికి ఎంత అర్థమైందనే దానికన్నా ఎంత తక్కువ సమయంలో ఎంత ఎక్కువ సిలబస్ పూర్తి చేస్తున్నామన్నదే ప్రధానంగా మారింది. వారికి మార్కులు తెచ్చుకునే యంత్రాలు కావాలి. తాము అడ్మిషన్లు పెంచుకోవాలి. ఈ విధంగా కార్పొరేట్ లైఫ్ విద్యావ్యవస్థను కుంగదీస్తోంది. దీని పరిణామాలు రాజకీయాలపైనా పడే ప్రమాదం ఉంది. విద్యారంగాన్ని వ్యాపారులకు అప్పగించి ప్రభుత్వం ప్రేక్షకుడిలా చూడటం ప్రజలను మోసం చేయడమే.

ప్రభుత్వ స్కూళ్ళపై కార్పొరేట్ ప్రభావం?

కార్పొరేట్ సంస్థల ప్రభావం సర్కారీ స్కూళ్ళపై బాగా పడింది. కార్పొరేట్ సంస్థలు మార్కులు ఎలా సంపాదించాలనే మంత్రాన్ని కనుగొన్నాయి. అక్టోబర్ నాటికి సిలబస్ పూర్తి చేయించడం, అప్పటి నుండి మార్చి వరకు గత పది సంవత్సరాల ప్రశ్నాపత్రాలు రుబ్బాలి. అవే ప్రశ్నలు పరీక్షల్లో వచ్చేట్లు చూసుకోవాలి. అవే ప్రశ్నలను వల్లె వేయించాలి. ఆ ప్రశ్నలతోనే మార్కులు తెచ్చుకోవాలి. ఈ పరిస్థితి ఐదారేళ్ళ పాటు కొనసాగిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఫలితాలు పెంచాలని పాలకులు కలెక్టర్లను ఆదేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కూడా కార్పొరేట్ కల్చర్‌ను ప్రవేశపెట్టారు. మార్కులు పెంచడమే లక్ష్యంగా మారింది. గత మూడేళ్ళుగా కార్పొరేట్ విద్యా విధానమే జిల్లా పరిషత్ విద్యా విధానమైంది. ఫలితాల పోటీ మొదలైంది.

పరీక్షా విధానంలో లోపాలను అందరూ ఉపయోగించుకుంటున్నారు. జిల్లా పరిషత్ స్కూళ్లు మార్కుల్లో పోటీకి రావడంతో కార్పొరేట్ స్కూళ్ళు ర్యాంకుల కోసం పోటీపడుతున్నాయి. విద్యపై మార్కెట్ శక్తులు దాడి చేస్తున్నాయి. ప్రభుత్వం స్వయంగా ప్రయివేటు పాఠశాలలను పొగడటం ప్రారంభించేసరికి అదే ప్రామాణికం అనుకుని అందరూ దాన్నే అవలంబిస్తున్నారు. హైస్కూల్ చదువు ఫీజు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతోంది. చాలా దేశాల్లో పాఠశాల విద్యకు అతి తక్కువ ఖర్చు అవుతుంది. ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తుంది. మనదేశంలోనే చాలా ఎక్కువ ఖర్చు పెట్టాల్సివస్తోంది.

పాఠశాల విద్యపై ప్రభుత్వానికి మీరిచ్చే సూచనలు?

గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది పిల్లలు ఇంగ్లీష్‌లో తప్పుతున్నారు. అందువల్ల ఇంగ్లీషు టీచింగ్‌ను పటిష్టం చేయాలి.

సిలబస్ మార్చే ముందు, కొత్త అంశాలు చేర్చే ముందు టీచర్లకు ఓరియంటేషన్ నిర్వహించాలి.

స్కూళ్ళ తనిఖీ ఒక తంతుగా మారింది. అలాగాకుండా టీచర్‌కు మార్గదర్శకంగా ఉండే ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి.

ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా సైన్స్ లాబరేటరీ ఉండాలి. ఆర్థిక పరిస్థితి అందుకు అనుమతించకపోతే మొబైల్ వ్యాన్ పెట్టాలి. ప్రాక్టికల్స్ లేకుండా సైన్స్ చెప్పరాదు. ఇవన్నీ చేస్తే కొంత ప్రమాణాలు పెరుగుతాయి. ప్రయివేటు స్కూళ్లలో ఫీజులను నియంత్రించాలి.

కాంట్రాక్ట్ టీచర్ల పద్ధతి తొలగించాలి. టీచర్ల సంఘాలతో చర్చించి వారిలో నిర్మాణాత్మక దృక్పథాన్ని పెంచాలి. వారిని శత్రువుల్లా చూడరాదు. ఉపాధ్యాయ సంఘాల్లో వృత్తిపరమైన మెరుగుదల వచ్చేట్లుగా ప్రభుత్వం కృషి చేయాలి. ★

గత నాలుగేళ్ళుగా నూరు శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు

పాఠశాలలు	2001	2002	2003	2004
ప్రభుత్వ	16	18	44	35
జిల్లా పరిషత్	50	100	239	596
మున్సిపల్	00	00	07	06
రెసిడెన్షియల్	14	39	34	102
ప్రయివేటు	223	357	580	836
మొత్తం	303	514	904	1575

మంది ఉత్తీర్ణులయ్యారు. వరంగల్ జిల్లా వరుసగా మూడోసారి 91.15 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, హైటెక్ సిటీ హైదరాబాద్ కూడా వరుసగా మూడో సంవత్సరం కూడా 67.56 శాతంతో తన అధమ స్థానాన్ని నిలబెట్టుకుంది. అయితే నూరు శాతం ఫలితాలు సాధిస్తున్న స్కూళ్ళు కూడా పెరుగుతున్నాయి. గత ఏడాది వివిధ యాజమాన్యాల కింద ఉన్న 904 స్కూళ్ళు నూరు శాతం ఫలితాలు సాధించగా ఈ ఏడా వాటి సంఖ్య 1575కి పెరిగింది.

సున్నా ఫలితాలు సాధించిన పాఠశాలలు ఈ ఏడాది 22 ఉన్నాయి. అయితే వాటిలో ప్రయివేటువే 90 శాతం ఉన్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్‌లోనే అక్షరాస్యతా శాతం ఎక్కువ. కాని ఇక్కడే పదవ తరగతిలో ఏటా ఎక్కువ మంది తప్పుతున్నారు. ఈ నగరంలోనే ప్రయివేటు పాఠశాలలు ఎక్కువున్నాయి. విద్యా వ్యాపారం తారాస్థాయిలో జరుగుతోంది. చాలా ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు దండుకోవడంలో చూపించే శ్రద్ధ అర్హత గల ఉపాధ్యాయులను నియమించడంలో చూపకపోవడం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒక దశాబ్దం క్రితం కార్పొరేట్ కాలేజీల ఏర్పాటులో విపరీతమైన పోటీ ఏర్పడింది. లెక్కలేనన్ని కాలేజీలు ఏర్పడినా వేళ్ళ మీద లెక్కించగల స్థాయిలోని కాలేజీలే ఇంటర్‌మీడియట్ విద్యలో గుత్తాధిపత్యం చలాయిస్తున్నాయి. ఈరోజున రాష్ట్రంలో మొత్తం ఇంటర్మీడియెట్ విద్యార్థుల్లో మూడోవంతు మంది ఈ నాలుగైదు కార్పొరేట్ కాలేజీల్లోనే చదువుతున్నారు. వీటికి రాష్ట్రవ్యాప్తంగా బ్రాంచీలు హైదరాబాద్ నగరంలోనే పది నుండి ఇరవై వరకు బ్రాంచీలు ఉండటం, అవి చేసే ప్రచారం, జిమ్మిక్కులు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం గత ఐదారేళ్లగా అనుమతించిన వందలాది జూనియర్ కాలేజీల భవితవ్యం డోలాయమానంలో పడింది. జూనియర్ కాలేజీల పోటీ ఒక స్థాయికి రావడంతో ఆయా సంస్థల దృష్టి ఇప్పుడు కార్పొరేట్ స్కూళ్ళ వైపు మళ్ళింది. ఇంతకు ముందు అక్కడక్కడా పెద్ద పట్టణాలు, జిల్లా కేంద్రాలకే పరిమితమైన కార్పొరేట్ స్కూళ్ళు అంతటా విస్తరిస్తున్నాయి. సువిశాలమైన ప్రాంగణాల్లో భవనాలు నిర్మించి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు.

రాష్ట్రంలో ఒకప్పుడు కోస్తా జిల్లాల్లో ధనికులు లారీలు కొరేవారు, తర్వాత వడ్డీ వ్యాపారాలు మొదలెట్టారు, ఆ తర్వాత సినిమా రంగంలోకి ప్రవేశించారు, ఇప్పుడు కార్పొరేట్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నారు. లక్షలు ఖర్చు పెట్టి కోట్లు సంపాదించడం విద్యా వ్యాపారం ద్వారా నేర్చుకున్నారు. ఎంత సంపాదించినా పన్ను లేకపోవడం, పైగా ఉన్నత స్థాయిలో పలుకుబడి, గ్యారెంటీ లాభాలు ఉన్న వ్యాపారం కావడంతో అనేకమంది ధనికులు ఇటువైపు మళ్ళు తున్నారు. ఈ తాకిడికి ప్రభుత్వ పాఠశాలలు తట్టుకోలేకపోతున్నాయి. ఏకోపాధ్యాయ పాఠశాలలు, ఒంటి గది బడులే ఇప్పటికీ అనేక గ్రామాల్లోని పిల్లలకు దిక్కు. ఏమాత్రం ఆదరవు

ఉన్నా చదువుపై ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్ళకే పంపిస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్ళలో ఉపాధ్యాయులకు ఎక్కువ జీతాలు ఇవ్వాల్సి వస్తుందని పదవ తరగతి ఉత్తీర్ణులైనవారిని విద్యా వాలంటీర్లుగా నియమిస్తున్నారు. పైకి వందల, వేల కోట్లు ప్రాథమిక విద్యకు ఖర్చు పెడుతున్నామని చెబుతున్నా అసలు ప్రమాణాలు పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్ళు రంగ ప్రవేశం చేసి టెన్త్ మార్కులను 600కి గాను 589 వచ్చే స్థాయికి తీసుకువెళ్ళాక ఫలితాల శాతం పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఫలితాలు పెంచమని ఆదేశాలు రాగానే జిల్లా స్థాయిలో అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నారు. మంచి ఫలితాలు సాధిస్తున్నారు. కాని దీనివల్ల వచ్చే లాభం ఏమిటో తెలియడం లేదు. ఒకనాడు 40 శాతంగా ఉండే ఉత్తీర్ణతా శాతం నేడు 80 దాటింది. ఉత్తీర్ణత అంటే ప్రథమశ్రేణి అనే అర్థం వచ్చే విధంగా తయారైంది. కాని ఇంటర్మీడియట్ పరీక్షలకు వచ్చేసరికి పదవ తరగతిలో ముందున్న జిల్లాలు వెనుకబడుతున్నాయి. జిల్లాల స్థానాలు తారుమారవు తున్నాయి. కార్పొరేట్ వెల్లువలో కొట్టుకుపోతున్న పాలకులు మన సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని, మన పల్లెలు, అక్కడి జీవితాలను పట్టించుకోవడంలేదు. ఫలితాలు సాధిస్తే చాలు, అది ఎలాగైనా సరే అనే స్థితికి వచ్చారు. ఈ పోటీ మధ్య పల్లెల్లోని సగటు విద్యార్థి ఏమైపోతాడో అని ఆలోచించడంలేదు. కార్పొరేట్ సంస్కృతితో ప్రాథమిక విద్య ఒక మేడిపండులా మెరిసిపోతోంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా ఈ మత్తునుండి బయటపడి ప్రాథమిక విద్యను పటిష్టపరచడానికి తగిన చర్యలు తీసుకోవాలి. ఇంగ్లీషు చదువులు, తెలుగు చదువులు, పల్లెలు, పట్టణాల చదువుల మధ్య పెరుగుతున్న అగాథం పూడ్చాలి. ప్రభుత్వపాఠశాలల్లో అన్ని తరగతులకు అవసరమైన ఉపాధ్యాయులను నియమించడం, చాక్‌పీసులు కూడా కొనలేని దుస్థితి నుండి పాఠశాలలను రక్షించడం, బాలలకు, ఉపాధ్యాయులకు కనీస అవసరాలైన మంచినీరు, మరుగుదొడ్ల వసతి ముఖ్యం. ఉన్నత విద్య ఎలాగూ పూర్తిగా కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోయింది. భావిపౌరుల భవిష్యత్‌కు పునాది వేసే ప్రాథమిక విద్యను అయినా కార్పొరేట్ బందిఖానాలోకి వెళ్లకుండా నిరోధించడం పాలకుల విద్యుక్త ధర్మం. ★

కాళ్లప్పన్న

కేతవరపు భాస్కర్



నా చిన్నప్పటి మాట.

అప్పట్లో మా ఊరికి సరైన రోడ్డు కూడా ఉండేది కాదు. ఎవళ్లయినా మా ఊరు రావాలంటే అటు మాకారపాలెంలోనో, ఇటు గిడుతూరులోనో బస్సు దిగి అక్కణ్ణించి ఓ మూడు నాలుగు కిలోమీటర్లు లెఫ్ట్ రైట్ కొట్టాల్సిందే.

మా ఊరు నుంచి ఎవరైనా ఎక్కడికైనా వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. గిడుతూర్నించి వస్తే రాళ్ల రోడ్డంట నడిచి రావాలి. తిన్నగా చూసుకు నడవకపోతే కాళ్ల గోళ్లను ఏ రాళ్లో ఎత్తుకుపోయేవి. అయినా ఆవైపు ఒకే బస్సుండేది.

మాకారపాలెంవైపు బస్సులెక్కువే. కానీ, ఆ ఊరు నుంచి మా ఊరుకు రోడ్డుండేది కాదు. పొలం గట్లమ్మట నడుచుకుంటూ రావాల్సిందే. అది వర్షాకాలమైతే ఆ పొలంగట్లమీద నడక సర్కస్ ఫీట్లను పోలి ఉండేదని ఇప్పుడనిపిస్తోంది.

దానికితోడు ఆ తోవలో ఏరొకటి అడ్డంగా ఉండేది. వర్షాకాలమైతే ఏరు మాంచి జోరుగా పారేది. ఇక అప్పుడు మా ఊరు రావాలంటే నానా చావూ వచ్చేది.

అప్పట్లో మా ఊళ్లో సరైన కిరాణా దుకాణాలుండేవి కావు. టీచర్ ఉద్యోగాలు చేసుకునే కొంతమంది అటు గిడుతూర్నుంచో ఇటు మాకారపాలెం నుంచో నెల రోజులకు సరిపడేన్ని వెచ్చాలు తెచ్చుకునేవారు.

ఇహ ఊళ్లోని పేదకుటుంబాలు ఏ రోజుకు కావాల్సిన సరుకులు ఆ రోజే తెచ్చుకునేవారు. వీళ్లకోసమేనన్నట్టు మా ఊళ్లో ఒకే ఒక్క కిరాణా కొట్టుండేది.

ఆ ఊరికి గొల్లబాబు కొట్టే పెద్ద డిపార్ట్‌మెంటల్ స్టోర్స్.

ఊరు ఊరంతా ఇంచుమించు అక్కడే డబ్బిచ్చో, అరువు పెట్టో సామాన్లు తీసుకునేది. ఆ కొట్టుకు పొరుగూళ్ల నుంచి సామాన్లు తేవడం అంటే అదో యజ్ఞమే.

అప్పట్లో రోడ్డు సరిగ్గా లేనందువల్ల అటు గిడుతూరికి కనీసం రిక్షా కూడా నడిచేది కాదు. మాకారపాలేనికి ఏ వాహనం వెళ్లే ప్రసక్తే లేదు.

* * *

మా ఊళ్లోని కొట్టుకు సామాన్లు తేవడానికేనన్నట్టు ఓ మనిషుండేవాడు. వాడు ఇంకా చాలా పన్లే చేసేవాడు. కానీ, బరువులు తేవడంలో వాడికి వాడే సాటి. వాడి ముందు మన కరణం మల్లేశ్వరి కూడా బలాదూరేనని నా అభిప్రాయం.

వాడి పేరు కాళ్లప్పన్న.

కాళ్లు పొడుగ్గా ఉన్నందువల్లనే వాడికి ఆ పేరు వచ్చిందని అనుకుంటే పప్పులో రెండు కాళ్లూ వేసేసినట్టే.

వాడింటి పేరు కాళ్ల. వాడి పేరు అప్పన్న. కలిసి వాడి పేరు కాళ్లప్పన్నయిపోయింది.

వాడు దృఢకాయుడేవీ కాదు.

జస్ట్... అస్థిపంజరానికి తోలు తొడిగినట్టుండేవాడు. వాడి పొట్ట తన చిరునామా పోగొట్టుకుని వీపులో కలిసిపోయి ఉండేది.

ఒంటిమీద ఓ మొల్తాడు, దానికి ఓ రెండడుగుల గోచీ గుడ్డ, నెత్తిమీద- చెమట, మట్టి, ధూళి దుమ్ముతో మురికిపట్టి ఉన్న చిన్న తువ్వాలుతో చుట్టిన తలపాగా, దానికి వాడి ఎడం చెవికి మధ్య ఒద్దిగ్గా ఇరుక్కుపోయిన చిన్న చుట్టముక్క... ఇదీ వాడి అవతారం.

వాడికో పెళ్లాం, ఓ కూతురు. ఇదీ వాడి కుటుంబం.

ఓ రోజు మేం అవతారం తాతగారి మావిడి తోటలో ఆడుకుంటూంటే గిడుతూరు నుంచి వస్తూ కనిపించాడు కాళ్లప్పన్న.

నెత్తిమీద ఓ బియ్యపు బస్తా. బస్తా అంటే ఇప్పటి పాతిక్కేజీల లొట్టికాయ బస్తా కాదు. అక్షరాల 26 కుంచాలు... అంటే వంద కేజీల బస్తా. నెత్తిమీద ఆ బస్తాతోపాటు ఎడం చేతిలో పప్పులు, ఉప్పులు ఉన్న ఓ కోవటి సంచీ, కుడి చేతిలో ఓ నూనె డబ్బా.

వీటన్నింటినీ మోసుకుని వస్తున్నాడు కాళ్లప్పన్న.

మేవంతా ఆటలు మానేసి వాడికేసి ఆశ్చర్యంగా చూస్తూండిపోయాం.

ఇంటికొచ్చి మా మామ్మనడిగితే వాడలాగే మోస్తాడంది.

ఆ తరువాత అలాంటి బస్తాను ఎత్తి మోద్దావని ప్రయత్నించాం. మేం నలుగురం కలిసినా ఆ బస్తాను అంగుళం కూడా కదపలేకపోయాం. వాడంత బరువు ఎలా మోశాడో!

ఇంకోసారి...

మా ఈడు పిల్లలవంతా ఈత నేర్చుకున్న కొత్త. అప్పుడు వేసంగి సెలవులు కావడంతో మేవంతా మజ్జాన్నం ఏటవతల చిట్టిబాబుగారి నూతిలో ఈతకు వెళ్లాం.

ఈదడం అయ్యాక మిడసర్లగ్నంలో ఇంటికి వస్తూంటే మాకారపాలెం నుంచి వస్తూ కనిపించాడు కాళ్లప్పన్న. నెత్తిన, భుజాన అవే బరువులు.

మరోసారి...

మాంచి వానలు కురిశాయి. మా ఊరికి పెద్ద ఏరు వస్తోందంటే చూడ్డానికి వెళ్లాం. మేం ఏటికి

(మిగతా 19వ పేజీలో)

స్త్రీకి స్త్రీయే శత్రువా?

అంపశయ్య నవీన్

"గుండు చేయించుకున్నావు... తిరుపతిగ్గాని వెళ్ళొచ్చావేమిటి?"

"అవును సార్... మనవడు పుడ్తే తలనీలాలిస్తానని మొక్కుకున్నాను."

"మనవడు పుట్టాడా?"

"పుట్టాడు సార్... మూన్నెల్లయ్యింది..."

"నువ్వు తలనీలాలిస్తాననడం వల్లనే మనవడు పుట్టాడంటావా? లేక నీ కొడుకు, కోడలు కాపురం చెయ్యడం వల్ల పుట్టాడంటావా?"

"అలా అడుగుతారేం సార్! కొడుకు, కోడలు కాపురం చెయ్యకపోతే మనవడెలా పుడ్తాడు సార్?..."

"అవును కదా... నువ్వు తలనీలాలు సమర్పించుకుంటానని మొక్కి ఉండకపోయినా నీకు మనవడు పుట్టేవాడే కదా...."

"వాళ్ళ పెళ్ళయ్యాక మూడేళ్ళ దాకా వాళ్ళకు పిల్లలు పుట్టలేదు సార్.. నేను తలనీలాలిస్తానని మొక్కుకున్నాకే మా కోడలు గర్భవతయ్యింది. కాబట్టి నాకు మనవడు పుట్టడంలో శ్రీవెంకటేశ్వరస్వామి పాత్ర కూడా ఉందని నమ్మకుండా ఎలా ఉండగలను సార్..."

"మూడేళ్ళ దాకా పిల్లలు పుట్టకపోతే మీరు మీ కోడల్నీ, కొడుకునీ డాక్టర్ల దగ్గరకు తీసుకెళ్ళారా? లేదా?"

"తీసుకెళ్ళాం సార్!"

"అన్ని పరీక్షలు చేయించారా? లేదా?"

'చేయించాం సార్!"

"డాక్టర్లు పిల్లలు పుట్టకపోవడానికి కారణమేమిటని తేల్చారు?"

"మా కోడలులో ఏదో లోపముందని ఆమెకు ఆపరేషన్ చేశారు సార్!"

"ఆపరేషన్ చేశాకే మీ కోడలు గర్భవతయింది... అవునా?"

"అవును సార్!"

'దీన్ని బట్టి మీ కోడలు గర్భవతి కావడానికి ఆమెలో వున్న లోపాన్ని సరిచేసిన డాక్టర్లు కారణమని అనుకోవాలిగానీ, వెంకటేశ్వరస్వామి కారణమనుకోవడమేమిటి?"

"దేనికదే సార్... మానవ ప్రయత్నానికి దైవసంకల్పం కూడా తోడ్పడితేనే మనం అనుకున్నవి నెరవేరుతాయి..."

"నీ తల వెంట్రుకలిస్తేనే దేవుడు సంతోషించి నీకు మనవణ్ణిచ్చాడంటావా? నీ తలవెంట్రుకల్ని దేవుడేం చేసుకుంటాడంటావు?"

"నాకు తెలీదుసార్... అందరూ గుండ్లు చేయించుకుంటున్నారని నేనూ చేయించుకున్నాను. ఎలాగూ, మనవడు పుట్టకపోయినా ఓసారి తిరుపతికెళ్ళి గుండు చేయించుకుందామనుకున్నాను..."

"నలుగురితోపాటు నారాయణ అనడమే నీ పాలసీ అన్నమాట."

"అంతే సార్.."

"ఈ మధ్య ఒకావె మరొకావె ప్రధానమంత్రయితే గుండుకొట్టించుకుంటానని ప్రతిజ్ఞ చేసింది. ఆమె గుండు కొట్టించుకోవడం, నువ్వు గుండు కొట్టించుకోవడం ఒకటే నంటావా?"

"అది, ఇదీ ఒకటెలా అవుతుంది సార్. ఆమె గుండు కొట్టించుకోవడంతోటే ఆగిపోతానన్లేదు. గుండు కొట్టించుకొని, తెల్ల చీర కట్టుకొని, ఇంకేమీ తినకుండా శనగలు మాత్రమే తింటూ, నేలమీద పడుకుంటానంది."

"ఇవన్నీ ఎవరు చేసే పనులు?"

"పూర్వం ఛాదస్తపు బ్రాహ్మణకుటుంబాల్లో భర్త చనిపోతే భార్య చేత ఇలాంటి వెధవ పనులు చేయించేవాళ్ళు."

"అంటే ఇవన్నీ ఒకానొకప్పుడు కొన్ని కుటుంబాల్లో విధవలచేత చేయించే పనులేగదా?"

"అవును సార్!"

"ఇవన్నీ స్త్రీలను అణచివెయ్యడం కోసం, అవమానించడం కోసం పురుషులు సృష్టించిన నియమాలే కదా..."

"అవును సార్!"

"ఇప్పుడు ప్రపంచం చాలా మారిపోయింది గదా! స్త్రీలను అవమానించే రోజులు పోయాయి గదా.. ఇవాళ స్త్రీలనిలా అవమానిస్తే స్త్రీలు ఊరుకోరుగదా! తంతారు గదా.. స్త్రీల చైతన్య పరిధి ఎంతో విస్తరించింది కదా! ఇవ్వాళ్ళ భర్త చనిపోతే భార్యను ఇంతటి అత్యంత నీచమైన అవమానాలకు గురి చెయ్యడం లేదుగదా... అలాంటప్పుడు, ఓ మహానగరంలో దేశ రాజధానిలో నివసిస్తున్న ఓ మహిళామణి మరో మహిళ ప్రధానమంత్రయితే నేను విధవగా మారిపోతానని ప్రతిజ్ఞ చెయ్యడమేమిటి? గుండు కొట్టించుకొంటానని, తెల్లచీరకట్టుకుంటాననీ, శనగలు మాత్రమే తింటాననీ, నేలమీద మాత్రమే పడుకుంటానని ప్రతిజ్ఞ చెయ్యడం భారతీయ స్త్రీలనందరినీ అవమానించడం కాదూ?"

"అలాగే అనిపిస్తున్నది సార్!"

"ఇటీవలనే ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మరో మహిళారత్నమేమో ఫలానామె ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తే నేను ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేసి సన్యాసినిగా మారిపోయి హిమాలయ పర్వతాల మీదకెళ్ళి తపస్సు చేసుకుంటానని బెదిరించింది. ఐదేళ్ళు పరిపాలించమని ప్రజలు నీకో బాధ్యతనప్పగిస్తే ఎవరి మీది కోపాన్నో ప్రజలమీద చూపించి ఆ బాధ్యతకు తిలోదకాలిస్తానంటే ప్రజలు క్షమిస్తారా? వీళ్ళసలు బాధ్యతంటే ఏమిటో, సభ్యతా సంస్కారాలంటే ఏమిటో తెలిసిన వాళ్ళేనా? స్త్రీకి స్త్రీయే శత్రువని పురుషులు సృష్టించిన ఒక అపవాదును నిజం చెయ్యడమే వీళ్ళ లక్ష్యమా? ఇదంతా చూస్తోంటే మనం 21వ శతాబ్దంలో ఉన్నామా?- లేక మధ్యయుగాల్లో ఉన్నామా? అన్న సందేహం కలుగుతోంది." ★





బ్రహ్మచారులు - భార్యలు

మేకల మదన్‌మోహన్‌రావు

ఆఫ్రికా దేశంలో 'ఒబా' అనే ఊరు వుంది. అక్కడ 'టెంబో', 'కలామెలిమ్' అనే ఇద్దరు బ్రహ్మచారులున్నారు. ఇద్దరూ మాంచి యుద్ధవీరులు. టెంబో మృదు స్వభావి. ఇతరులకు సహాయపడే స్వభావం కలవాడు. కానీ కలామెలిమ్ ఎవరిపట్లా దయ చూపడు. ఎవ్వరికీ సహాయపడడు.

ఒక చలికాలం ఉదయాన టెంబో వేట కోసం అడవికి వెళ్లాడు. అక్కడ అతనికి 'మోమా' అనే రాక్షస కొండచిలువ తారసపడింది. వెంటనే బాణం సంధించి దాని మీదకి ప్రయోగించబోయాడు.

అంతలో మోమా, 'చలి నన్ను కదలనివ్వకుండా చేసింది. దయచేసి ఏదన్నా వెచ్చటి ప్రాంతానికి తీసుకెళ్లవా?" అని బతిమాలింది.

అసలే దయార్ద్ర హృదయుడైన టెంబో దాన్ని అతి కష్టంమీద ఒక వేడి నీటి ఊట దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత దాన్ని నెమ్మదిగా అందులోకి జారవిడిచాడు.

ఆ వెచ్చదనానికి మోమాలో చైతన్యం వచ్చింది. బలవంతురాలైంది. మోమా అతనికి కృతజ్ఞతలు చెప్పి, "నువ్వు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారంగా నీకేం కావాలి?" అని అడిగింది.

"చేతనైతే ఒక పెళ్లికూతుర్నివ్వు" అన్నాడు టెంబో.

వెంటనే ఆ కొండచిలువ నీటి అడుగు భాగానికి వెళ్లి ఒక గుమ్మడికాయతో తిరిగి వచ్చింది. దాన్ని టెంబోకు బహూకరించి 'త్వరలోనే నీ ఒంటరితనం తీరిపోతుంది' అంది.

టెంబో గుమ్మడికాయతో సహా తమ పల్లెకు తిరిగి వెళ్లాడు. వెంటనే అది అతని చేతుల్లోంచి జారి కిందపడి, అంతకంతకు పెరగసాగింది. అది అలా పెరిగి, పెరిగి ఆఖరికి పగిలిపోయింది. అందులో నుండి ఒక యువతి బైటకు వచ్చింది.

"ఎవరు నువ్వు?" ఆశ్చర్యంగా అడిగాడు టెంబో.

"నీ భార్యను'' నవ్వుతూ అందామె. అలా టెంబో ఒక ఇంటివాడయ్యాడు.

ఇక ఆ ఊళ్లో మిగిలిపోయిన ఒకే ఒక్క బ్రహ్మచారి కలామెలిమ్. తాను కూడా టెంబోలాగే భార్యను సంపాదించుకోవాలనుకున్నాడు. ఓ రోజు అతడు మోమాను వెతుక్కుంటూ అడవికి వెళ్లాడు. అక్కడ ఒక కాలి బాట మీద శరీరాన్నంతా చాచి పడుకొని వున్న మోమా కనిపించింది. అది ఊపిరిపీల్చడానికి కూడా ఇబ్బంది పడుతోంది. వెంటనే కలామెలిమ్ తన వింటికి బాణాన్ని సంధించి దాన్ని మోమా మీద ప్రయోగించబోతున్నట్టుగా నటించాడు.

అప్పుడు మోమా, "ఈ ఎండలకు నా శక్తి అంతా ఉడిగిపోయింది. ఒక్క అంగుళం కూడా కదల్లేను. నా శక్తి తిరిగి నాకు వచ్చేలా ఏదన్నా చల్లటి ప్రదేశానికి తీసుకుపో. లేకపోతే నేను చచ్చిపోతాను..." అంది.

టెంబో వెంటనే మోమాను తన వంటికి చుట్టుకుని తీసుకెళ్తే, కలామెలిమ్ దాని తోక పట్టుకొని బరబరా లాక్కెళ్లాడు. నది దగ్గరకు వెళ్లేటప్పటికి మోమా ఒంటి నిండా గాయాలయ్యాయి. శరీరం అంతా రక్త సిక్తం అయ్యింది. కానీ కలామెలిమ్ అవేమీ పట్టించుకోలేదు. నది దగ్గరకు రాగానే దాన్ని అందులోకి విసిరేశాడు.

తాను తిరిగి శక్తి పుంజుకున్నాక ఆ కొండచిలువ, "నువ్వు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారంగా నేనేమి ఇవ్వగలను?" అని అడిగింది.

"ఒక వధువునివ్వు" అన్నాడు నిర్లక్ష్యంగా కలామెలిమ్. ఆ పాము వెంటనే నదిలో మునిగి ఓ గుమ్మడికాయతో తిరిగి వచ్చింది. దాన్ని అతనికి అందిస్తూ, "నీ ఒంటరితనం త్వరలోనే తీరిపోతుంది" అంది.

కలామెలిమ్ సంభ్రమంగా ఆ గుమ్మడికాయను తీసుకుని తన ఊరికి పరిగెత్తుకుంటూ బయలుదేరాడు. కానీ మార్గ మధ్యలోనే గుమ్మడికాయ చెయ్యి జారి కిందపడింది. అది అంతకంతకు పెరిగి, ఆఖరికి పగిలిపోయింది. అందులో నుండి ఒక రాక్షస యువతి బైటకొచ్చింది.

ఆ భయంకర ఆకారాన్ని చూస్తూ "ఎ...ఎ...ఎవరు నువ్వు?" అని గట్టిగా అరిచాడు కలామెలిమ్. "నీ భార్యను" అందామె వికటాట్టహాసం చేస్తూ.

"వద్దు... వద్దు... నాకు భార్య వద్దు... ఏమీ వద్దు..." అంటూ పరుగు లంకించుకున్నాడు కలామెలిమ్. కానీ ఆ రాక్షసి అతని కాలు పట్టుకుని (అతడు కొండ చిలువను లాక్కెళ్లిన మాదిరిగా) ఇంటిదాకా లాక్కెళ్లింది. అప్పుడు అతగాడికి బుద్ధి వచ్చింది. అలా లాక్కెళుతుంటే ఎంత బాధగా వుంటుందో తెలిసొచ్చింది. ఇంకెప్పుడూ ఎవరినీ అలా బాధపెట్టకూడదని, చేతనైనంత సాయపడాలని నిర్ణయించుకున్నాడు. అంతటితో ఊరుకోకుండా కొండచిలువ దగ్గరకెళ్లి క్షమాపణలు కూడా చెప్పుకున్నాడు. ఆ తర్వాత రాక్షస యువతి ఎన్నడూ కలామెలిమ్‌కి కనిపించలేదు.



చిన్నారి చిత్రకారులు



జి.రాంశ్రీగౌతమ్, 9వ తరగతి,
అనూస్, వనపర్తి,
మహబూబ్‌నగర్.

డి.దుర్గావరప్రసాద్,
10వ తరగతి,
ఆర్ఎమ్‌హెచ్ హైస్కూల్,
విజయవాడ.





జి.మను చంద్ర,
7వ తరగతి,
తాడేపల్లి.



పి.గౌరిప్రసాద్‌నాయుడు,
పొడుగు నారాయణమ్మ కాలనీ,
శ్రీకాకుళం.

ఎం.ఝాన్సీ,
9వ తరగతి, విశ్వభారతి హైస్కూల్,
ఎన్‌టిపిసి, రామగుండం.

ఎన్నినక్కలున్నాయి

హలో నేస్తాలూ! కింది బొమ్మలో పర్వతాలు, నక్కలు వున్నాయి చూ 'ఒక నక్కే కదా వుంది. నక్కలు అంటున్నారేంటి?' అనుకుంటున స్పష్టంగా కనిపించేది ఒక నక్కే. పరిశీలనగా చూస్తే పర్వతాల్లో, మొ బోలెడన్ని నక్కలు కనిపిస్తాయి.ఇంకా సులభంగా తెలియడానికి క్లూ చెప్పమంటారా! పర్వతాల చివర్లను గమనించండి. ఏంటి ఏ తెలుస్తోందా! మరి ఆలస్యం ఎందుకు? బాగా వెతకండి.



రంగులు అద్దుతారా



గ్రౌండ్ వుంటే బావుండు

హేయ్! నా పేరు బుజ్జి. నేను హైదరాబాదులోని ఓ ప్రయివేటు స్కూల్లో 6వ తరగతి చదువుతున్నాను. అక్కడ ఫీజులు బాగానే కట్టించుకుంటారు. అన్ని హంగులూ వున్నాయి. అంటే... యూనిఫారమ్, బూట్లు, టైలు, బ్యాడ్జీలు... ఇవన్నమాట. కానీ నాకేమో ఆడుకోవడమంటే చాలా ఇష్టం. అక్కడ ఆటస్థలం లేనే లేదు. ఎప్పుడన్నా ఒక్కసారి ఎక్కడికన్నా తీసుకెళ్లి ఆడిస్తారు. ఆ రోజు మినహా మిగతా రోజులన్నీ పొద్దున్నుంచి, సాయంత్రం వరకు అదే స్కూల్లో, అదే తరగతిగదిలో, అదే బెంచీలో, అదే ప్లేస్‌లో కూర్చోవాలి. అన్నంకూడా అక్కడే తినాలి. ఇది నాకు అస్సలు నచ్చలేదు. మాకు ఎంచక్కా గ్రౌండ్ వుంటే బావుండు.

నేస్తాలూ... మరి మీ స్కూలు ఎలా వుంటుంది? మాష్టార్లు బాగా చెప్తారా? అన్ని సౌకర్యాలు వున్నాయా? అందరు మాష్టార్లు వున్నారా? ఇంకా మీ బడిలో ఏం వుంటే బావుంటుందనుకుంటున్నారు? పూర్తి అడ్రస్‌తో కార్డుమీద రాసి పంపండి . ఎంచక్కా బొమ్మ వేయించి ప్రచురిస్తాం. మా చిరునామా: బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

అర్థమెటిక్ పుస్తకం విచారానికి కారణం ఏంటబ్బా?



హాయ్ం! వక్కన ఎవరో వున్నారు. పేరు చెప్పకోండి చూద్దాం. య్యన్. మీ సమాధానం సరైనదే. అర్థమెటిక్ పుస్తకం గారున్నారు. కాకపోతే వారు చాలా విచారంగా వున్నారు. ఈ క్షణమో, మరుక్షణమో కళ్లెంట నీళ్లు పెట్టుకునేట్టున్నారు. చూస్తుంటేనే జాలేస్తోందికదూ. మరి వారి విచారానికి కారణం ఏంటో మీరే చెప్పాలి. తొందరేం లేదు. ఇంకా ఏడు రోజుల సమయం వుందిలే. బాగా ఆలోచించుకోండి.

చిక్కుప్రశ్న

గోమయం అంటే...

నేస్తాలూ...! గోమయం అంటే ఏంటో తెలిసిందా? చెప్పండి చెప్పండి. ఏంటీ? గోవులతో నిండి వుండడమా! పప్పలో కాలేశారుగా. సారీ పప్పలోకాదు. గోమయంలో కాలేశారుగా. 'పిల్లలమయం' అంటే పిల్లలతో నిండివుండడం అన్నారుకదా అని ... గోమయం అంటే గోవులతో నిండి వుండడం అనుకుంటున్నారు. కానీ... సరైన జవాబు ఏంటంటే... పేడ అని అర్థం. తెలిసిందా!

కోతులు పక్షి

ఒక పక్కన నిలబడి దమనకుడితో పాటు ఆ పోరాటాన్ని చూస్తున్న కరకటకునికి బాధ కలిగింది. ''మూర్ఖుడా! అన్యోన్యంగా వున్న స్నేహితుల మధ్య వైరం పెట్టావు. వాళ్లు పోట్లాడుకునేలా చేశావు. చెడు బోధలు చేసేవాడు తాను చెడటమే గాక తన రాజుకు కూడా ప్రమాదం తెస్తాడు. నీ స్వార్థం కోసం పింగళకుడినీ, సంజీవకుడినీ వేరుచేశావు. మంచివారికి హాని చేసే నీవు బుద్ధి హీనుడవు. ఇలాంటివి చెయ్యవద్దని నీకు ముందే చెప్పాను. అయినా నువ్వు వినలేదు. మూర్ఖులకు బుద్ధి చెప్పడం అంటే కోతులకు బుద్ధి చెప్పబోయిన పక్షిలా చావడమే" అంటూ కరటకుడు ఆ కథ ప్రారంభించాడు.

పంచతంత్ర కథలు

మలయ ప్రాంతంలో ఒక అడవి వుంది. అందులో కొన్ని కోతులు నివసిస్తున్నాయి. అవన్నీ 'తాను పట్టిన కుందేలుకి మూడే కాళ్లు' అనే రకం. తాము చేసింది తప్పయినా సరే దాన్ని ఒప్పకోవు. పైగా మంచి చెప్పబోయిన వాళ్లనే నిందిస్తాయి. అందుకే వాటికి సలహాలు ఇవ్వడానికి ఏ జంతువూ ముందుకు రాదు.

అది శీతాకాలం. బాగా చలిగా వుంది. చలికి అడవిలోని జంతువులన్నీ వెచ్చటి ప్రదేశాల్లో ముడుక్కొని పడుకున్నాయి. ఈ కోతులకు కూడా బాగా చలిగా వుంది. మిగతా జంతువుల్లా ఇవి గుహలు, బొరియల్లో తల దాచుకోలేదు. సాయంత్రమయ్యే కొద్దీ చలి ఇంకా పెరగసాగింది. సందె చీకట్లు ముసురుకున్నాయి. అప్పుడు ఈ కోతుల్లో ఒకదానికి ఓ ఉపాయం తట్టింది. ఎక్కడైనా నిప్ప దొరికితే అక్కడ చలి కాచుకుందామనుకుంది. దాని ఆలోచన మిగతా వాటికి కూడా నచ్చింది. నిప్ప కోసం వేట మొదలుపెట్టాయి. చీకట్లో మిణుకు మిణుకుమని మెరుస్తున్న చోటికి వెళ్లాయి. ఆ మెరుపు నిప్పలదేనని దాని దగ్గర కూర్చొని చలి కాచుకోసాగాయి. నిజానికి అవి నిప్పలు కావు. మిణుగురు పురుగులు. చీకట్లో వాటిని చూసి కోతులు నిప్పలనే అనుకున్నాయి. నిప్పలైతే కాస్తన్నా వెచ్చదనాన్నిస్తాయి. అలాంటివేవీ కోతులు గమనించలేదు. మిణుగురు పురుగుల ఎదుట కూర్చొని చలి కాచుకుంటున్నట్టు ఫోజులు కొట్టసాగాయి.

ఇదంతా దగ్గర్లోని చెట్టుపైన కూర్చున్న సూచీముఖమనే పక్షి చూసింది. అది ఆ అడవికి కొత్తగా వచ్చింది. దానికి ఈ కోతుల సంగతి ఇంకా తెలియదు. అందుకే వాటికి సలహా ఇద్దామని దగ్గరకు వెళ్లి... "వానరులారా! అవి మిణుగురు పురుగులు. నిప్పలు కాదు. వాటి వల్ల మీ చలి తగ్గదు. అదుగో దూరాన వున్న ఆ చెట్టు దగ్గర నిప్ప వుంది. అక్కడికి పోయి చలి కాచుకోండి" అంది.

ఇలాంటి సలహాలంటే నచ్చని మూర్ఖపు కోతులు పక్షి వైపు కోపంగా చూశాయి. "మాకేమన్నా బుద్ధిలేదనుకున్నావా? పెద్ద తెలివిగల దానిలా మాకే చెప్పడానికి వస్తావా? నీకు అంత పొగరా?" అని తిట్టడం మొదలుపెట్టాయి. ఇంకా కోపం తగ్గక ఆ పక్షిని పట్టుకొని గొంతు నులిమి చంపేశాయి.

కోతులు - పక్షి కథ చెప్పి దమనకుడితో, "కాబట్టి నీ వంటి మూర్ఖులకు మంచి చెప్పినా చెడుగానే భావిస్తారు" అన్నాడు కరటకుడు. "అంతేకాదు. బుద్ధిహీనులు మంచి చెప్పినా వాని మాటలు వినకపోగా ఆ చెప్పిన వారికే హాని చేయబోయి చివరకు వారే చెడతారు. అందుకు నిదర్శనంగా నందిగుప్తుడు, సుదర్శనగుప్తుల కథ చెప్తాను విను" అంటూ కరటకుడు చెప్పసాగాడు.

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

ఆకాశంలో చీకటి
చిక్కబడింది.
మబ్బుల వెనుక
నక్షత్రాలు
దోబూచులాడుతున్నాయి.
ఊరికి దూరంగా
ఉన్న తాటి తోపుల్లో
మనుషులు నిశ్శబ్దంగా
కదులుతున్నారు.
వెలిగించిన నెగళ్ళ నీడలు
దూరంగా
ప్రతిఫలిస్తున్నాయి. సారా
వాసన గాలిలో కలిసిపోయి
అదోలాంటి మత్తును
కలిగిస్తోంది.
వరుసగా
అయిదారు పెద్ద కుండలు
రాళ్ళపొయ్యిలపై పెట్టి కింద
కట్టెలు దూర్చి పెద్ద పెద్ద
మంటలు పెడుతున్నారు.
చుట్టూ బలిష్టంగా ఉన్న
మనుషులు కాపలా
తిరుగుతున్నారు.

కాచిన సారాను నింపడానికి ప్లాస్టిక్ కేనులు సిద్ధంగా వున్నాయి. ఆ డబ్బాలను రవాణా చేయడానికి రోడ్డు వార వ్యాను కూడా సిద్ధంగా వుంది. వారానికి ఒకసారి ఈ విధంగా సారాను తయారు చేసి ఆ పరిసర గ్రామాలకు పంపిణీ చేయడం అక్కడి వారికి అలవాటు.

తమిళనాడు రాష్ట్రంలో తిరువళ్ళువార్ జిల్లాలో 'భీమన్‌తోపి' గ్రామంలో నిత్యకృత్యంగా జరుగుతూ సారా తయారీదారులు లాభాలు గడిస్తున్నారు. వారు తయారు చేసిన సారా మంచి మత్తు ఇవ్వడంతో చాలా మంది ఎగబడుతుంటారు. ఒకప్పుడు నామమాత్రంగా సారా సేవించే ఆ గ్రామస్తులు కాపుసారా అందుబాటులోకి రావడంతో పరమానందంగా తాగుతున్నారు.

సారా మరిగి నురగలు కక్కే సమయం ఆసన్నమైంది. చల్లారిన తర్వాత పీపాల్లోకి ఎక్కించడానికి సిద్ధపడుతున్నారు.

కొంతకాలంగా ఎదురు చూసిన సమయం వచ్చింది.

యశోద రెండు వందల మంది మహిళల్ని పోగు చేసింది. వారందరూ సారాపై సమరం చేయడానికి సిద్ధపడిన వారే. తమ భర్తలు, సోదరులు, పిల్లలు మద్యానికి బానిసలై ఒళ్ళు గుల్ల చేసుకుంటుంటే చూడలేక ఉద్యమించడానికి సిద్ధపడ్డారు.

వారందరినీ యశోద సంఘటిత పరిచింది.

సారా తయారీ చేసే బట్టీలపై దాడి చేయాలని అందర్నీ సమాయత్తం చేసింది. గ్రామానికి దూరంగా వున్న తయారీ ప్రాంతానికి నిశ్శబ్దంగా చేరుకున్నారు.

కర్రలు, రోకళ్ళు, రాళ్ళు పట్టుకుని మహిళా దండు ముందుకు కదిలింది. ఎవరూ ఊహించని విధంగా సారా బట్టీలపై దాడి జరిపారు. మరుగుతున్న సారా కుండలను వగులగొట్టారు. అక్కడ కావలా వున్న తయారీదారులపై ఉమ్మడిగా దాడి చేశారు.

హఠాత్తుగా విరుచుకుపడిన మహిళల్ని చూసి అక్కడి వారు విస్తుపోయారు. మొదట కొద్ది క్షణాల పాటు ఏమి చేయాలో వారికి పాలుపోలేదు. వెంటనే తేరుకుని ఎదురు దాడికి దిగారు.

అప్పటికే జరిగిపోవలసిన నష్టం జరిగిపోయింది.

సారా వంటకు పెట్టుబడి పెట్టిన త్యాగరాజు ఒక మహిళ వద్ద కర్ర లాక్కుని యశోద నెత్తిమీద బాదాడు. 'అమ్మా' అంటూ యశోద కూలబడిపోయింది. ఇది చూసి ఆమె కుమార్తె ఇంద్ర తల్లికి అడ్డుగా వచ్చి నిల్చుంది. ముందు నుంచి గునపం ఒకటి విసురుగా వచ్చి ఆమె కడుపులో గుచ్చుకుంది. నోటమాట రాకుండానే కుప్పకూలిపోయింది. యశోద చెల్లెలు రత్న ఎదురుగా వెళ్ళి త్యాగరాజుపై కర్ర ఎత్తగా వెనుక నుండి మరో వ్యక్తి ఆమె తలపై తీవ్రంగా కొట్టడంతో తల రెండు ముక్కలైపోయి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

సారా బట్టీలను ధ్వంసం చేయడానికి వచ్చిన ఇతర మహిళలు కూడా రకరకాలుగా గాయపడ్డారు. అక్కడి వాతావరణం రక్తసిక్తంగా, భయానకంగా తయారైంది. ఈ పోరాట సమీపంలో వున్న గ్రామస్తులంతా పరుగు పరుగున అక్కడికి చేరుకున్నారు.

గాయపడిన వారిని తరలించడానికి గ్రామంలో అగ్రవర్ణాలకు చెందిన ఇద్దరు ధనవంతుల్ని ట్రాక్టర్లు ఇవ్వమని బతిమిలాడారు. అయితే ఎవరూ ముందుకు రాలేదు.

ఆ తర్వాత ఎవరో పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వారు జీపుతో వచ్చి గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన

యశోద కుమార్తె ఇంద్రకు, చెల్లెలు రత్నకు పోస్టుమార్టం చేయించారు. మరో ఇరవై రోజుల్లో పెళ్ళికూతురుగా మారి అత్తవారింట్లో అడుగు పెట్టవలసిన కుమార్తె ఇంద్ర మృతదేహాన్ని చూసి యశోద గుండెలు అవిసేలా విలపించింది.

2000 సెప్టెంబర్ 6న జరిగిన ఈ సంఘటన యశోద జీవన గమనాన్నే పూర్తిగా మార్చివేసింది. అయిన వాళ్ళంతా మృతి చెందడంతో ఒంటరిగా అయిపోయి పోరాట పటిమను ప్రదర్శించింది.

* * *

తిరువళ్ళువార్ జిల్లాలో 'సెంటర్ ఫర్ రూరల్ ఉమెన్స్ ఎడ్యుకేషన్ ఫర్ లిబరేషన్' అనే స్వచ్ఛంద సంస్థ యశోదలో పోరాటపటిమను గుర్తించింది. చదువు లేకపోయినా, ధనం లేకపోయినా అన్యాయాలపై ఉద్యమించాలన్న యశోద పట్టుదల ఆ సంస్థకు నచ్చింది.

ఆ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పడిన 'గ్రామ పెంగల్ సంగమమ్' అనుబంధ శాఖకు యశోద అధ్యక్షురాలిగా ఎంపికైంది. దీనినే రూరల్ ఉమెన్స్ ఫ్రంటుగా వ్యవహరిస్తుంటారు. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళల్ని సభ్యులుగా చేర్చుకుని కార్యక్రమాలను మొదలు పెట్టింది. సారాపై సమరానికి శ్రీకారం చుట్టి ఆ గ్రామంలో సారా అమ్మకాలు లేకుండా చేసింది. ఆ గ్రామానికి చెందిన వారు ఎవరైనా సారా కావాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్ళవలసిందే తప్ప ఆ గ్రామంలో మాత్రం లభించకుండా కట్టడి చేసింది.

వివిధ విషయాలపై సంస్థలో నాయకులు ఆమెకు అవగాహన కలిగించారు. పోరాట పటిమను ఎలా ప్రదర్శించాలో ప్రజలను ఏ విధంగా సంఘటితం చేయాలో యశోద కూలంకషంగా తెలుసుకుంది. తాను తెలుసుకున్నది ఆచరణలో పెట్టింది.

ఆ గ్రామంలో మహిళలందరినీ ఒకమాట మీద తీసుకురావడానికి కృషి చేసింది. గ్రామ పరిపాలన పంచాయతీరాజ్ వ్యవస్థ పనితీరుపైన వారికి అవగాహన కలిగించి సగానికి సగం మందిని ఒకేమాట ఒకే బాటగా తయారు చేసింది. భీమన్ తోపి గ్రామంలో రోడ్లు, కాలువలు, మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస సదుపాయాలు కల్పించాలని స్థానిక నాయకులపైన ఒత్తిడి తీసుకువచ్చారు. తమకు అవసరమైన సదుపాయాలు కల్పించకపోతే పాలకపక్షాలు ఎందుకు అని నిలదీశారు.

గ్రామంలో రేషన్ కార్డులు, భూమికి సంబంధించిన రికార్డులు, పింఛన్ల పంపిణీ వంటి కార్యక్రమాల్లో కలిసికట్టుగా కృషి చేశారు. గ్రామంలో మహిళలంతా సంఘటితంగా గ్రామ పంచాయతీ పనులకు సహకరించడం పట్ల అందరి ప్రశంసలు పొందారు.

ఆ సమయంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు వచ్చాయి. గ్రామంలో ఉత్సాహవంతులైన మహిళలు 32 మంది వార్డు సభ్యులుగా పోటీ చేశారు. వీరిలో మొత్తం 9 వార్డులకు గాను 8 వార్డులలో మహిళలే వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరంతా మహిళల హక్కులపై చైతన్యం కలిగించడంతో బాటు వరకట్న వేధింపులు, బహుభార్యత్వం, స్త్రీ హింస వంటి సమస్యలపై పోరాటాలు చేసి గ్రామంలో ఎటువంటి తగవులు లేకుండా కృషి చేశారు.

ఈ కార్యక్రమాలన్నింటికీ యశోదే నాయకురాలు.

గ్రామంలో అందరి సౌకర్యం కోసం బస్సు షెల్టరు నిర్మించాలని యశోద చేసిన ప్రతిపాదనకు మహిళలంతా ముందుకు కదిలారు. సిమెంటు, ఇసుక, ఇటుకలు సంపాదించి తామే కూలీలుగా మారారు. వారం రోజులు కష్టపడి బస్సు షెల్టరు నిర్మాణాన్ని పూర్తి చేశారు.

ఆ సమయంలో సారా కొట్లాట కేసు విచారణకు వచ్చింది. యశోదకు సమన్లు అందాయి.

దాడి చేసిన వారిపై కేసు ఉపసంహరించుకుంటే లక్ష రూపాయలు ముట్ట చెబుతామని త్యాగరాజు మనుషులు రాయబారం పంపారు. చెల్లిని, కూతుర్ని కోల్పోయిన యశోద ఎటువంటి ఒత్తిడులకు లొంగలేదు.

కేసు వాదనలు ముగిశాయి.

త్యాగరాజు, అతని వర్గీయులు జైలు పాలయ్యారు.

* * *

సన్నగా గాలి వీస్తోంది.

భీమన్ తోపి గ్రామం ప్రశాంతంగా ఉంది.

ఊరి చివర దళితవాడలో ఉన్న చిన్న పెంకుటిల్లు నిశ్శబ్దంగా ఉంది. యశోద ఒక్కతే ఒంటరిగా కూర్చుంది. ఆమె చేతిలో పలక ఉంది. పుస్తకంలో అక్షరాలు రాయడం ప్రాక్టీసు చేస్తోంది. కొద్దిరోజులు ఈ విధంగా సాధన చేస్తే అందరిలా తనూ రాయగలనన్న నమ్మకం కలిగింది.

'యశోదమ్మా!' పోస్టుమేన్ పిలిచాడు.

ఆమె సమాధానం చెప్పకముందే లోపలికి వచ్చి 'నీకో పెద్ద కవరు వచ్చింది!' అని చెప్పి దానిని ఆమెకు చూపించి 'నేనే చదువుతానులే!' అన్నాడు. తర్వాత కవరు చింపి అందులో ఉత్తరాన్ని బైటికి తీశాడు.

గబగబా చదివి 'గొప్ప ఛాన్సు కొట్టావులే!' అన్నాడు. తర్వాత అందులో సారాంశాన్ని చెప్పాడు.

'నీరజా భానోత్' అనే పోరాట యోధురాలి పేరుతో నెలకొల్పిన అవార్డు ప్రతి ఏడాది ఒక్కో మహిళకు ఇస్తారు. ఇది ఎంతో ప్రతిష్ఠాకరమైనది. దేశం మొత్తం మీద 88 మంది మహిళల పేర్లు పరిశీలించి 2001 సంవత్సరానికి గాను నీకు అవార్డు ప్రకటించారు. ఈ అవార్డు కింద రు.1.50 లక్షల నగదు ఇచ్చారు. ఇదిగో చెక్కు..." అంటూ పోస్టుమేన్ చూపించాడు.

ఆ తర్వాత ఆమెను అభినందించి వెళ్ళిపోయారు.

యశోద ఉత్తరాన్ని పట్టుకుని అలా ఉండిపోయింది. ఉత్తరంతో పాటు ఉన్న చెక్‌ను చూసింది. ఎంతో ఆనందం అనిపించింది. తన సారా సమరానికి లభించిన పురస్కారం ఉద్వేగాన్ని కలిగించింది.

అప్రయత్నంగా గోడవైపు చూసింది.

తన చెల్లి... ఇరవయ్యేళ్ళ తన కూతురు ఫోటోలు నవ్వుతూ కన్పించాయి.

యశోద హృదయం కలుక్కుమంది.

ఎవరూ లేని ఒంటరి జీవితం గుర్తుకు వచ్చింది.

అప్రయత్నంగా కన్నీళ్ళు ఉబికాయి.

ఇంతలో గ్రామంలో మహిళలు విషయం తెలుసుకుని యశోద ఇంటికి వచ్చారు. వచ్చిన సొమ్ముతో మేడ ఇల్లు కట్టుకోమని కొందరు.... సంస్థ ద్వారా మహిళలందరికీ రుణాలు ఇవ్వాలని కొందరు.... గ్రామాభివృద్ధి చేయాలని మరికొందరు సూచించారు.

అందరి మాటలు విన్న తర్వాత యశోద మనసులో ఒక ఆలోచన కార్యరూపం దాల్చింది. తర్వాత వచ్చిన వారందరినీ సమావేశపరిచి చెప్పింది. "ఈ డబ్బు... నావాళ్ళకు రానున్న ఎక్స్‌గ్రేషియా సొమ్ము కలిపి నా కూతురు, చెల్లి పేర్లతో 'ఇంద్ర... రత్న అవార్డు'ను ఏర్పాటు చేస్తాను. అహింసాయుత పోరాటం చేసే మహిళలకు ఈ సొమ్ములో కొంత అవార్డుగా ఇస్తాను" యశోద ప్రకటించింది.

ఆమె మాటలకు చాలా మంది మహిళలు అభినందనలు తెలిపారు. యశోద మళ్ళీ గొంతు సవరించుకుని 'నేనూ ఇంద్రలాగ, రత్నలాగ ఏదో ఒక రోజు చనిపోవచ్చు. కానీ మన కోసం మనమే పోరాటం సాగించాలి. ఇక చావు గురించి అంటారా ఎవరైనా బతికేది చచ్చేది ఒక్కసారే!'' యశోద మాటలకు మహిళలందరూ కరతాళ ధ్వనులతో స్వాగతించారు. ★

దూసుకుపోండి!

లక్ష్మి

ధైర్యే సాహసే లక్ష్మి అన్నారు!

అంచేత దూసుకుపోవాలే తప్ప చూసుకుంటూ పోతే - ఎక్కడో చోట ఎందుకో ఒకందుకు బ్రేకులు పడిపోతాయి!

అవాంతరాలకు అతీతంగా-

అనుకున్న కార్యక్రమం కొనసాగించడం ఉత్తముల ప్రథమ లక్షణం. ఉత్తముల లక్షణాల గురించి పెద్దలు పద్యాల్లో చెప్పనే చెప్పేరు!

కొందరు ఏ పనీ చేయకుండా చేతులు కట్టుక్కూచుంటారు. అదేమిటని ఎవరైనా అడిగితే పనిగండం వుందని వంక చెబుతారు!

కొందరు తాము తలపెట్టిన పనిపూర్తికాకుండానే అలిసిపోతారు. చేయగలమో లేదోనని దవుటు పడతారు. విఘ్నాలు తాకిడికి చేతులెత్తేస్తారు.

పట్టుదలకు ప్రతీకలైనవాళ్ళు మాత్రం -

ధ్యేయసాధనకు అనుక్షణం కృషి చేస్తుంటారు!

ఇందులో ఆడామగా అనే తేడాల్లేవు. పరీక్షకి వెళ్ళాలి. ఆ పరీక్షలో మనం నెగ్గాలి. టూకీగా ఇదీ మన ధ్యేయం!

తప్పుతామేమోనన్న దవుటుతో పరీక్షని గాలికొదిలేసి కూచోడం పద్ధతి కాదు!

చదివింది అర్థం కాదేమోనని... అర్థమైంది గుర్తు పెట్టుకు రాయలేమనీ... గుర్తు పెట్టుకున్నది పరీక్షలో రాదనీ దవుట్లు పెట్టుకుంటే బాగుపడలేం!

ఎంతటి మనిషినైనా-

దవుటు ఎంతోకొంత కృంగదీస్తుంది!

మనసులో ఏ శంకాలేకపోవడమే ఫిఫ్టీ పర్సెంటు విజయానికి పెట్టుబడి అవుతుందని మా లెక్కల మేస్టారు చెప్పేవారు!

ఏ లోకాన వున్నారో గాని -

ఆ మేస్టారు తలపెట్టిన ప్రతి పనీ ఆ స్థాయిలోనే జయప్రదం కావడం ఆ రోజుల్లో మా అందరికీ తెలుసు!

ఏతావాతా -

ఎల్లాంటి పరిస్థితి అడ్డం పడినా దూసుకుపోయే స్వభావానికి అలవాటు పడాలి. ఆగిపోతే అడ్రస్సు దొరకని దిక్కుమాలిన రోజులివి!

దగ్గితే చాలు -

క్షయరోగం కాబోలనే భయంతో వణికిపోయే మనిషి చాలా ముందరే కాలం చేస్తాడు!

మనిషై పుట్టేక దగ్గులూ, తుమ్ములూ తప్పవు. వాటికి పెద్ద పెద్ద పేర్లు పెట్టుకుని మంచమెక్కితే అంతే సంగతులు!

తిరగబడాలి. లేదూ - నిజంగా అది పెద్ద రోగమే అయినా చేసేది ఏమీ లేదు గనక శేషజీవితాన్ని ధైర్యంగా నెట్టుకుపోవాలి. ఏమైపోతానో గదా అని మక్కుతూ మూలుగుతూ మూలపడితే - ఇరవై ఏళ్ళకే అరవైఏళ్ళ మనిషైపోతాం!

నిత్య శంకితులు బతికినా - చచ్చిన వాళ్ళతో సమానమని చెబుతుంటారు. ఆ మాట వేదవాక్కుగా భావించాలి!

మా ఆడపడుచు గురించి మీకు చెప్పాలి!

ఆ అమ్మాయికి పెళ్ళయి రెండేళ్ళయ్యింది. అతను మంచివాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. భార్యని ఎంతో ప్రేమగా చూసుకుంటాడు!

అత్తవారింటో జనాభా కూడా అతిమంచి వాళ్ళు!

మా ఆడపడుచుకి వాళ్ళత్తగారి మీద దవుటెందుకు్కలిగిందో గాని - అంత మంచి ఇంటో ఆ పిల్ల సుఖపడలేకపోతోంది! వాళ్ళత్తగారు 'మందుల మనిష'ని ఎవరో చెప్పగా విన్నారట. అంతే! ఆనాటి నుంచి తన బతుకుని నిత్యశంకతో నరకం చేసుకుంటోంది!

అత్తగారి చేత్తో మంచినీళ్ళిచ్చినా ముట్టుకోదు!

ఆ పెద్దావిడ స్వయంగా స్వీట్సు తయారు చేసి తిను తల్లీ అని ప్రేమగా పెడితే - నా వంటో బాగోలేదత్తయ్యా అని తిరస్కరిస్తుంది! మా ఆడబిడ్డ తిక్క స్వభావానికి ఆ పెద్దావిడ చిన్నబుచ్చుకోని రోజే లేదుట!

అస్తమానం అనుమానిస్తుంటే-

ప్రేమానురాగాలకు చోటెక్కడుంటుంది?

మనిషై పుట్టేక కష్టసుఖాలు తప్పవు. చిన్న నష్టానికి గుండె ఆగిపోయి - పెద్ద అదృష్టానికి పిచ్చెక్కిపోతే ఆ బ్రతుకేం బ్రతుకూ?

ఏది జరిగినా -

దాని ఆంతర్యమేమిటని ఇరవైనాలుగ్గంటలూ తర్జన భర్జనలతో గడిపేస్తుంటే - ఆ మనిషి బతికేం ప్రయోజనం?

భగవద్గీతలో కిష్టుడేం చెప్పేడు?

దూసుకుపొమ్మన్నాడు!

చేయవలసిందేదో చేసి - రిజల్టు నాకు విడిచిపెట్టమన్నాడు. వజ్రం లాంటి ముక్క సెలవిచ్చేడు!

అయితే -

భగవద్గీతకి అర్థతాత్పర్యాలు చెప్పే పండితులు సైతం దవుట్లు పెట్టుకుని కృంగిపోయే ఈ కాలంలో - ఎవర్ని ఆదర్శంగా తీసుకోవాలో తోచక అవస్థ పడుతున్నాం! ★

కళాకారులారా మీరెటు ?

రుక్మిణి

ఆటో రిక్షాలో సినిమా పాటలు టేపురికార్డర్‌లో వేసుకుంటూ రెండు వారాలకు ముందువిడుదలైన తెలుగు సినిమా ప్రచారం చేసుకుంటూ పోతోంది.

"నేడే చూడండి ఫలానా ఫలానా వారు నటించిన గొప్ప కళాఖండం – అంతర్జాతీయ దర్శకుడు రాయవేందరరావు మీకు కడు వినోదం కలిగించే దృశ్యాలను చూప్పించాడు. ప్రఖ్యాత హాస్యనటుడు ఎ.వై.ఎస్. తన బోడిగుండుతో మీ కడుపు చెక్కలయ్యేలా వెకిలి హాస్యం... అబ్బో... అబ్బో...

జక్కులోడు నిలబడి తీరిగ్గా ఈ ప్రచారాన్ని వింటున్నాడు. అప్పుడే మల్లేశు వచ్చి చప్టామీద కూలబడ్డాడు. యాద్గిరి బీడి మీద బీడి పీకుతూ చూస్తున్నాడు.

"అన్నా – యాద్గిరన్నా మనం సినిమాలు చూడకపోతే ఎవరికి నష్టం" జక్కులోడు అసహనంగా అడిగాడు. యాద్గిరి బీడీ దూరంగా విసిరేసి "ఎవరికి నష్టమో విషయం వదిలేస్తే మనకు మాత్రం గ్యారంటీగా లాభం...!" ఈ సమాధానికి మల్లేశు కిసకిస నవ్వాడు. జక్కులోడు తెల్లబోయాడు. యాద్గిరి ఓ నవ్వు నవ్వి "మనం పని మానుకుని పదో పాతికో పెట్టి టిక్కటు కొని హాల్లో సినిమా చూడాలి గదా – అందులోనూ నేతి బీరకాయ సినిమాలు చూసి మనం నేర్చుకునే నీతి ఏమైనా వుందా...!" జక్కులోడు నోరు తెరిచాడు.

"అది కాదన్నా మానసిక ఆనందం..."

"జక్కులోడ్ని యాద్గిరి గద్దించాడు. చూడ్రా తమ్మీ – నిజాయితీలేని వ్యాపారం, నీతిలేని రాజకీయాలు సమాజానికి అపారమైన హాని చేస్తాయి!" ఈ మాటలతో జక్కులోడు ఆలోచనలో పడిపోయాడు.

"మొన్నటికి మొన్న దాదాపు అరవై డెబ్బై మంది టీవీ సినీ కళాకారులు – ప్రజల ఆదరణ మీదనే బ్రతికే కిరాయి కళాకారులు ఏం చేశారు!"

యాద్గిరి ప్రశ్నకు జక్కులోడు బుర్ర అడ్డదిడ్డంగా ఆడించాడు.

"కళా రంగం పూర్తిగా వ్యాపార రంగం అయిన ఈ రోజుల్లో ప్రజలకు వ్యతిరేకంగా... ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకంగా బజార్న పడి ప్రజలను అపహాస్యం చేశారు. మరి మళ్లా ఏ మోహం పెట్టుకుని తన 'కళాఖండాల'ను చూడమని ప్రజలను దేబిరిస్తారు."

"మరి జనం చూస్తున్నారు గదా అన్నా" జక్కులోడు చాలా అయోమయంగా అన్నాడు. యాద్గిరి మరో బీడీ వెలిగించి పొగవదిలాడు.



"ప్రజావ్యతిరేక సిద్ధాంతాలతో విధానాలతో ఏర్పడిన ప్రజాకంటక పార్టీలో చేరండి. ఎవడికీ అభ్యంతరం లేదు. ఏ.సి.రూముల్లో అరచేతి మందాన మేకప్ వేసుకుని లైట్ల ముందు – కెమెరాముందు నగ్నంగానో, అర్ధనగ్నంగానో నటించండి. దొంగ, చెల్లని చెక్కులిచ్చి కోర్టులకు హాజరుకండి. అభ్యంతరం లేదు. మీ కళను అమ్ముకోండి. సొమ్ము చేసుకోండి. ఎవరికీ పట్టదు. రాజకీయాల్లో ఓనమాలు తెలవని మీరు, అసలు సామాన్య ప్రజల సమస్యలకు మూలం ఎక్కడుందో తెలవని మీరు వేదికలెక్కి రాజకీయ చిలకపలుకులు పలకకండి. జనం బాగా తెలివి మీరిపోయారు. మీ సినిమాలనే కాదు మీరు జనంలోకి వస్తే మీ గ్లామరు మీ గ్రామరు ఏదీ పని చేయదు. చరిత్రలో ప్రజాకంటకులకు పట్టినగతే మీకు పడుతుంది..."

యాద్గిరి దీర్ఘ గంభీర ఉపన్యాసానికి జక్కులోడు చప్టా మీద విరుచుకుపడ్డాడు. మల్లేశు నోరెళ్ళబెట్టాడు. ★

కన్ను పట్ల శ్రద్ధ అవసరం

డాక్టర్ కె.నాగేశ్వరరావు, డాక్టర్ పి.వి.రవీంద్రకుమార్
మోడరన్ కంటి ఆసుపత్రి

'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అన్నారు పెద్దలు. అటువంటి కంటి గురించి మనం జాగ్రత్త వహించటం చాలా అవసరం. నిత్యజీవితంలో ఎదురయ్యే కంటికి సంబంధించిన సమస్యల్ని ప్రాథమిక చికిత్స ద్వారా నయం చేసుకోవచ్చు. ఆహారపు అలవాట్ల వల్ల, నిద్రలేమి, రసాయన పదార్థాల పరిశ్రమల్లో పనిచేసే వారిలో కంటి సమస్యలు తొందరగా వస్తాయి. అయితే ఎక్కువభాగం మనం తీసుకునే జాగ్రత్తలతో వాటిని నివారించుకోవచ్చు. లోకంలోని సమస్త విషయాలను చూడగల్గేవి, మనిషికి ప్రాణ ప్రదమైనవి కళ్ళే. అలాంటి వాటి పట్ల ఏమాత్రం అజాగ్రత్తగా ఉండరాదు. కళ్ళకలక, కళ్ళు ఎర్రబడటం, తలనొప్పి, దృష్టిలోపం, నల్లగుడ్డుపై కురుపు, విటమిన్ 'ఎ' లోపం, రేచీకటి, కంటిరెప్పపై కురుపులు, కన్ను దురద, మంటలు, కన్ను దుర్మాంసం - పొరలు, శుక్లము, మెల్లకన్ను, నీటికాసులు, నీటితిత్తి ఇన్‌ఫెక్షన్, కన్నుకు దెబ్బ తగలడం, బిపి, షుగర్ వల్ల వచ్చే వ్యాధులు, కనురెప్ప వాలి పోవడం తదితర లక్షణాలు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వీటిని వెనువెంటనే నివారించుకోవడం సాధ్యమే.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కన్ను ఎర్రబడి పుసులు కడుతున్నప్పుడు, కంటిని గోరువెచ్చని నీటితో కడుగుతూ, యాంటిబయాటిక్ డ్రాప్స్ వాడాలి.
- కంటిలో నలుసు పడినపుడు కంటిని నలపరాదు.



- కంటిలో ఎటువంటి 'సిరాయిడ్ డ్రాప్స్' కంటి వైద్యుని పర్యవేక్షణ లేకుండా వాడరాదు.
- టెలివిజన్ (టీవీ) కనీసం 10 అడుగుల దూరం నుండి చూడటం తప్పనిసరిగా పాటించాలి. టీవీని ఎక్కువ సేపు చూడటం మంచిది కాదు.
- సరైన వెలుతురు ఉన్న గదులలోనే చదవటం, రాయటం మంచిది.
- వాహనాలు నడిపేవారు కంటి సంరక్షణ కోసం 'ప్రొటెక్టివ్ గ్లాసెస్' వాడటం అవసరం.



- సూర్యుని నేరుగా చూడటం, సూర్యగ్రహణం సమయంలో సూర్యుణ్ణి నేరుగా చూడటం అంత మంచిది కాదు.
- వ్యవసాయదారులు, ఇతరులకు కంటిలో ప్రమాదకరమైన ద్రవాలు లేదా రసాయనాలు పడినప్పుడు కంటిని వెంటనే శుభ్రమైన నీరు సెలైన్ వాటర్‌తో కడిగి నేత్రవైద్యుని సంప్రదించాలి.
- దృష్టిలోపం ఉన్నవారు, కళ్లజోడు వాడుతున్నవారు కనీసం సంవత్సరం లోపు ఒకసారి కంటి పరీక్షలు చేయించాలి.
- కంటికి ఏదైనా దెబ్బతగిలితే యాంటీబయోటిక్ ఆయింట్‌మెంట్ పెట్టి కట్టుకట్టి నేత్రవైద్యుని వద్దకు వెళ్ళాలి.
- రక్తపోటు, మధుమేహ వ్యాధి ఉన్న రోగులు కచ్చితమైన ఆహారనియమాలు పాటించాలి. ఆరునెలలకొకసారి వైద్యుని సలహాలు పొందాలి.
- కొన్ని వంశపారంపర్యంగా వచ్చే కంటి వ్యాధులు(ఉదా : మమోపియా) కలవారు పిల్లల విషయంలో ముందు జాగ్రత్తగా నేత్ర వైద్యుని సంప్రదించాలి.
- కొన్ని కంటి వ్యాధులు మేనరికపు వివాహం చేసుకున్నవారి పిల్లలలో వచ్చే అవకాశాలు ఎక్కువ (ఉదా : రెటినైటీస్, పిగ్మెంటోసా). కాబట్టి మేనరికపు వివాహాలు వీలైనంత వరకు ప్రోత్సహించరాదు.
- మెల్లకన్ను గల పిల్లలను వీలైనంత త్వరగా నేత్రవైద్యునితో పరీక్షలు చేయించి 10 నుండి 12 సంవత్సరాల లోపు వయస్సులోనే శస్త్రచికిత్స చేయించటం ద్వారా కంటి లోపలి నరానికి హాని కలగకుండా చేయవచ్చు.
- నీటి కాసులు జబ్బుగలవారు కూడా తమ కుటుంబంలోని ఇతర సభ్యులకు కూడా నేత్ర పరీక్షలు చేయించటం చాలా మంచిది.
- కంప్యూటర్ ఎక్కువగా అంటే రోజుకు 8 నుండి 10 గంటల వరకు వాడే వారిలో తలనొప్పి, మెడనొప్పి, కళ్లు ఎర్రబడి, ఎండిపోయినట్లు ఉన్నట్లయితే వారు మధ్యలో కంటికి కొంత విశ్రాంతి ఇస్తూ కంటి వైద్యుని సంప్రదించటం మంచిది.
- కంటికి సంబంధించి సొంత వైద్యం, పాత కంటి చుక్కలు వాడటం చాలా హానికరం.

కంటికి ఉన్న ప్రాధాన్యతను అలక్ష్యం చేయరాదు. తాను చనిపోయిన తర్వాత తన కళ్లను ఇతరులకు దానం చేయగల్గిన వారు ధన్యులు. భౌతికంగా పోయినా తమ కళ్లతో మరో మనిషిని ఆదుకొంటూ లోకాన్ని చూడగల్గడం ఎంతో అభినందనీయం. ప్రతి ఒక్కరూ కంటికి మేలు చేసే పోషక విలువలువున్న ఆహారపదార్థాలను తినటానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అతి చౌకగా లభించే ఆకుకూరలు, బొప్పాయి, మామిడి, క్యారెట్, పాలు, గుడ్లు లివర్ తదితర ఆహార పదార్థాల్లో లభించే విటమిన్ 'ఎ' ద్వారా కంటిని కాపాడుకోవచ్చు. కొన్ని విషయాల్లో మనకు మనమే జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కంటి వ్యాధుల నుండి రక్షించుకోగలుగుతాము. చాలా వరకు సమస్యల్ని పరిష్కరించుకోవచ్చు. కొన్ని పరిష్కరించుకోలేని విషయాల్లో నేత్రవైద్యుని సలహాలు, చికిత్స తప్పనిసరి. ★

కంటి మీద డయాబెటిస్ ప్రభావం

డయాబెటిస్ ఉన్నవారిలో కంటి చూపునకు సంబంధించిన ఇబ్బందులు ఎక్కువగా సంభవిస్తాయి. డయాబెటిస్ వచ్చిన ఐదు సంవత్సరాల నుండి కంటిలో మార్పులు మొదలవుతాయని 'ప్రజాశక్తి'కి వివరించారు. డయాబెటిస్‌కు లోనయ్యేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఎక్కువగా నడివయస్సులోనే ఈ వ్యాధికి గురవుతున్నారు. షుగర్ వ్యాధి మూలంగా అంధత్వానికి లోనయ్యేవారి సంఖ్య కూడా క్రమేపీ పెరుగుతోంది. షుగర్ వ్యాధి కంట్రోలులో లేనివారికి, అయిదేళ్ల కంటే ఎక్కువగా డయాబెటిస్‌తో బాధపడుతున్నవారికి, బిపి నియంత్రణలో లేనివారికి మూత్రపిండాల వ్యాధి ఉన్నవారికి, మరికొందరిలో జన్యుపరంగానూ ఈ వ్యాధి రావచ్చు. షుగర్ వ్యాధి ఉన్నవారిలో కంటి లోపల రెటీనా పొరలోని రక్తనాళాలు క్రమేణా దెబ్బతిని మూసుకుపోవటం లేదా చిట్లిపోవడం జరుగుతుంది. దీనివలన కంటిలోకి రక్తం స్రవించి రెటీనా ముడుచుకుపోయి శాశ్వత అంధత్వానికి దారితీస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్థులు కనీసం ఆరు నెలలకొకసారయినా కంటి పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలి. షుగర్ రోగులకు శుక్లం(కాటరాక్ట్) త్వరగా వస్తుంది. అలాగే త్వరితంగా ముదిరిపోతుంది. అందువలన త్వరగా శుక్లం ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. ఫండస్ పరీక్ష ద్వారా కంటి నరం డయాబెటిస్ వలన ఎంత వరకు దెబ్బతిన్నదో తెలుసుకోవచ్చు.

డయాబెటిక్ మాక్యులోపతి అంటే కంటిలో రెటీనా మీద దృష్టి నాడులు ఎక్కువగా కేంద్రీకృతమైన భాగాన్ని 'మాక్యులా' అంటారు. '90 డి' లెన్స్ ద్వారా ఈ వ్యాధిని స్పష్టంగా నిర్ధారించి చికిత్స చేస్తాము. రెటీనా పొరకు 'లేజర్' చికిత్స చేయటం ద్వారా ఈ వ్యాధిని అరికట్టే వీలుంది. తొలిదశలో చికిత్స వల్ల సత్ఫలితాలు వస్తాయి. పేషెంట్లలో ఉన్న చూపును తగ్గిపోకుండా కాపాడటం లేజర్ ట్రీట్‌మెంట్ ముఖ్యోద్దేశం. మధుమేహం రోగులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. డయాబెటిస్ మందునుగాని, ఇన్సులిన్‌గాని డాక్టర్ నిర్ణయించిన ప్రకారం క్రమం తప్పక వాడాలి. ఆహార నియమాలు, శరీర వ్యాయామం ఆచరించాలి. వ్యాధి తొలిదశలో ఉన్నప్పుడే గుర్తించి తగిన చికిత్స మొదలుపెట్టడం ద్వారా కంటి చూపు పోకుండా కాపాడుకోవచ్చు. ★



డాక్టర్ ఎ.శ్రీనివాస్
చైతన్య కంటి ఆసుపత్రి, విజయవాడ

కాళ్లప్పన్న

(9వ పేజీ తరువాయి)

ఇవతలి గట్టున నిలబడ్డాం.

అవతలి గట్టు నుంచి ఉన్నట్టుండి ఓ బస్తా వస్తున్నట్టు కనిపించింది. మేం నోళ్లు తెరుచుకు చూస్తున్నంతలోనే ఆ వెనకే కాళ్లప్పన్న ప్రత్యక్షమయ్యాడు. బస్తా బియ్యం నెత్తిన పెట్టుకుని... ఓ భుజానికి నూనె డబ్బా, ఇంకో భుజానికి సంచీడు సామాన్లతో నడుం లోతు ఏరు అవలీలగా దాటి ఇవతలకి వచ్చేశాడు.

మాకు నోటంట మాట లేదు. ఇంటికొచ్చి అదే విషయాన్ని చెప్పుకున్నాం. కొన్ని రోజులపాటు మా మధ్య కాళ్లప్పన్న విన్యాసాలే చర్చల్లో ఉండేవి.

ఇప్పుడనిపిస్తుంది, శ్రమైక జీవన సౌందర్యమంటే మా కాళ్లప్పన్నదేనని.

ఓ రోజు మా నాన్న అడిగారు. 'ఏరా! అప్పన్నా నువ్విలా బస్తాలు మోస్తుంటావు, నీకు గొల్లబాబు ఏంతిస్తాడు?'

'ఏవుందండీ! రెండు తవ్వల బియ్యం ఇస్తారు. రెండు పూట్లకొస్తుంది' అని అప్పన్న చెప్పడం నాకిప్పటికీ గుర్తే.

* * *

మేం కొంచెం పెద్దాళ్లవయ్యాం.

అప్పన్నా పెద్దాడయ్యాడు. వయస్సులోనే. వయస్సులో ఉన్నప్పుడు అన్ని మూటలు మోసినవాడు ఒక్క మూటా వెనకేసుకోలేకపోయాడు.

వయస్సు మీదపడ్డకొద్దీ నరాల్లో సత్తువ తగ్గింది.

పెళ్లాం పిల్లలు ఏ పనీ చేసేవాళ్లు కాకపోవడంతో ఆ వయస్సులో వాడిని ఆదుకునేవాళ్లు కరువయ్యారు.

ఎవరైనా దయతలిచి బియ్యం ఇస్తే గంజి తాగేవాడు. లేకపోతే ఆ వయస్సులో కూడా చేయగలిగిన పని చేసి ఆ పూటకి పొట్ట నింపుకునేవాడు. ఒక్కోసారి అది కూడా ఉండేది కాదు.

* * *

అవి రోహిణీ కార్తె ఎండలు.

నేనప్పుడు తొమ్మిదో తరగతిలోకి వచ్చాను.

అప్పన్నకి అప్పటికి రెండ్రోజుల్నుంచి తిండిలేదు. ఇంట్లో గింజల్లేవు.

ఆ పూటకి ఎక్కడో సంపాదించుకోవాలి. ఎవరిదో పెద్దాళ్ల లోగిల్లో పని దొరికింది.

పని పూర్తయింది.

'బాబూ! రెండ్రోజుల్నుంచి తిండి లేదు. కూలి డబ్బులిత్తే నూకలు కొనుక్కుని రెండు గెంజి నీళ్లు తాగుతాను.' పెద్దింటాయనతో అన్నాడు అప్పన్న.

'ఇప్పుడు డబ్బుల్లేవు. రెండ్రోజులాగి రారా' దర్జాగా చెప్పాడు పెద్దింటి యజమాని.

మూడు పూట్లా పంచభక్ష్యపరమాన్నాలు తినే అతడికేం అర్థమవుతుంది అప్పన్న ఆకలి బాధ?

'బాబ్బాబు! ఎలాగైనా చూడండి' ప్రాధేయపడ్డాడు అప్పన్న.

ఎంత విచిత్రం! కష్టపడి పని చేసి కూడా తన శ్రమ ఫలితాన్ని రాబట్టుకోడానికి యజమానిని బతిమాలుకోవాల్సిన దుస్థితి అది. అప్పన్నకే కాదు, ప్రతి శ్రమజీవికీ ఇది అనుభవైక వేద్యమే.

అప్పన్న విన్నపాలు యజమాని చెవికెక్కలేదు.

'రెండ్రోజులాగి రారా. మేవేం ఊళ్లోంచి పారిపోతావా? నీ ముష్టి డబ్బులు దొబ్బుకెళిపోతామనుకున్నావా?' అంటూ గద్దించాడు.

ఏం మాట్లాడలేకపోయాడు అప్పన్న. ఏం చేయలేని నిస్సహాయత, ఆక్రోశం ఆవరించాయి. తిన్నగా ఇంటికెళ్లిపోయాడు.

ఇంటి పంచన ఉన్న కుక్కి మంచం ఉండనా ఊడనా అన్నట్టుంది. అది విరిగిపోకుండా తడపలతో కట్లు కట్టాడు అప్పన్న.

తిండి లేకపోవడంతో ఒళ్లంతా శోష వచ్చినట్టుంది వాడికి. ఆ కుక్కిమంచంలో కడుపులో కాళ్లెట్టుకుని పడుకున్నాడు. వేడిగాలులు మొహాన్ని ఈడ్చి కొడుతున్నాయి. కుండలో చల్లటి నీళ్లు తీసుకుని కడుపు నిండా తాగాడు.

అదేం చిత్రమో కానీ, అన్ని మంటలనీ చల్లార్చే ఆ నీళ్లు... ఆ చల్లటి నీళ్లు అప్పన్న ఆకలి మంటల్ని మాత్రం ఆర్పలేకపోయాయి.

పైన ఆకాశం నుంచి అగ్నివర్షం కురుస్తోంది. కడుపులో ఆకలి మంటలు. మళ్లీ నీళ్లు తాగాడు అప్పన్న. మళ్లీ తాగాడు. మళ్లీ... మళ్లీ... పంచలోకి పోయి కుక్కి మంచంలో పడుకున్నాడు.

ఒళ్లంతా గాల్లో తేల్తున్నట్టుంది. పట్టపగలే అంత ఎండలోనూ వాడి కళ్లముందు చుక్కలు కనిపిస్తున్నాయి. లేచి కూచున్నాడు. 'ఆకలి... ఆకలి...' అని అరుస్తున్నాడు. చిత్రంగా ఆ మాటలు ఎవ్వరికీ వినిపించనంత నిశ్శబ్దంగా వస్తున్నాయి.

* * *

ఆ సాయంత్రం పక్కింటి సూరిగాడు అప్పన్న ఇంటికి వచ్చాడు.

'అప్పన్నా, పెద్దింటాయన నీకు కూలి డబ్బులిచ్చార్రా' చెప్పాడు సూరిగాడు.

అప్పన్న అలా శిలా విగ్రహంలా కూచునే ఉన్నాడు. 'లేవ్వేట్రా! ఇదిగో డబ్బులు తీస్కో' అన్నాడు సూరిగాడు. అప్పన్న మౌనంగానే ఉన్నాడు. అలా చూస్తూనే ఉన్నాడు. 'నిన్నేరా, ఏం మాట్టాడవేటి?' అంటూ సూరిగాడు అప్పన్నను తట్టాడు. ఒపక్క వేడి గాలులు వీస్తూనే ఉన్నాయి. వాతావరణం భగభగలాడుతోంది.

అంత వేడిలోనూ అప్పన్న శరీరం సూరిగాడి చేతికి చల్లగా తగిలింది. 'ఏట్రా అప్పన్నా? ఏటైంది?' అంటూ సూరిగాడు అప్పన్నను కుదిపాడు. ఆ కుక్కిమంచంలో అప్పన్న కట్టె అడ్డంగా విరుచుకుపడింది. ★

భారత సంవిధానం-1950

(కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా, 1950)

రాజ్యాంగం పౌరులకు ఎన్నో హక్కులను కల్పించింది. అయితే వాటి గురించి తెలియకపోవడం వలన కొందరు ముఖ్యంగా తెలుగువారు వాటిని పూర్తి స్థాయిలో పొందలేకపోతున్నారు. రాజ్యాంగంపై ప్రచురితమైన పుస్తకాలు ఇంగ్లీషు, హిందీ భాషల్లోనే ఎక్కువగా ఉండటం దీనికి ప్రధాన కారణంగా భావించవచ్చు. కాబట్టే సామాన్య తెలుగు పౌరులు దాని గురించి తెలుసుకోలేక రాజ్యాంగం తమకు కల్పించిన సంక్షేమాన్ని అందుకోలేకపోతున్నారని చెప్పవచ్చు.

రాజ్యాంగం గురించి తెలుగువారందరికీ తెలియజెపుతూ దాని ఫలాలు అందరూ అందుకునే అవకాశం కల్పించడానికే అన్నట్లు ఈ పుస్తకం వెలువడింది.

న్యాయ శాస్త్రానికి సంబంధించిన పుస్తకాల ప్రచురణలో అగ్రగామి అయిన ఏషియా లా హౌజ్ 'భారత సంవిధానం-1950 : వ్యాఖ్యాన సహిత మృదుమధుర ఆంధ్రీకరణ' పేరుతో ఈ పుస్తకాన్ని వెలువరించింది.

హైకోర్టు అడ్వకేట్‌గా ప్రాక్టీసు చేస్తున్న ఎన్.కె.ఆచార్య దీని రచయిత. న్యాయవాదిగానే గాక న్యాయశాస్త్రానికి సంబంధించిన రచనలు చేయడంలోనూ ఈయన అనుభవజ్ఞుడే.

రాజ్యాంగాన్ని ఏ రూపంలో చెబితే అందరికీ సులభంగా అర్థమవుతుందో అనుభవరీత్యా గ్రహించిన ఈయన ఆ రీతిలోనే పుస్తకంలో విషయాన్ని పొందుపరిచారు. సామాన్యులతో పాటు విద్యార్థులకు, న్యాయవాదులకు, ఇతరత్రా దీని గురించి తెలుసుకోవాలనుకున్న వారికీ ఉపయుక్తంగా ఉండేలా సులభశైలిలో అందించారు.

తెలుగులో రాజ్యాంగంపై పుస్తకాలు లేవా? అంటే ఉన్నాయి. అయితే అవి కేవలం ఇంగ్లీషులో ఉన్న దానిని తెలుగులో తర్జుమా చేసి అందించాయి. కానీ ఈ పుస్తకం అన్ని వర్గాల వారికీ అర్థమయ్యే రీతిలో, అన్ని అవసరాలనూ తీర్చే విధంగా రూపొందించి ఉంది.

పుస్తకంలోని విషయానికొస్తే దీనిలో రాజ్యాంగాంశాలైన ప్రస్తావన, ఆర్టికల్స్‌తో కూడిన 22 పార్టులు, 1 నుంచీ 12వరకూ ఉన్న షెడ్యూళ్ళు వాటిలో వివరాలను పొందుపరిచారు.

సాధారణ పుస్తకాలు రాజ్యాంగంలో అంశాలైన ప్రస్తావన, నిబంధనలు, షెడ్యూళ్ళను ఇంగ్లీషులో ఉన్నదున్నట్లుగా తెలుగులోకి తర్జుమా చేసి అందించాయి. కానీ ఇందులో విషయంలో భాగంగానే రాజ్యాంగం అనంతర కాలంలో చేసిన సవరణలను కూడా చేర్చి విషయాన్ని అప్‌డేట్‌గా అందించారు. దానితో చదువరులకు విషయానికి సంబంధించి చేసిన సవరణలను వెతుక్కుని పాతదానికి అనుసంధానం చేసుకుని అర్థం చేసుకోవలసిన ఇబ్బంది తప్పింది.



భారత సంవిధానం - 1950 :
వ్యాఖ్యాన సహిత మృదుమధుర ఆంధ్రీకరణ
రచయిత : ఎన్.కె.ఆచార్య; **పేజీలు** : 384
వెల : రు. 200; **ప్రతులకు** : ఏషియా లా హౌజ్, హైదరాబాద్; ఇతర ప్రముఖ పుస్తకాల షాపుల్లోనూ లభ్యమవుతాయి.

దీనివలన కాలానుగుణంగా రాజ్యాంగంలో చోటు చేసుకున్న మార్పులు, సవరణల అవసరాలు కూడా బోధపడతాయి. అవసరమైన చోట దేశంలోని ఉన్నత కోర్టులు ఇచ్చిన తీర్పులను కూడా పొందుపరిచారు. దీనితో ఆ అంశంపై కోర్టుల ఇంటర్‌ప్రిటేషన్‌కూడా సులభంగా చదువరి గ్రహించగలుగుతారు. దీనితో వారికి కన్‌ఫ్యూజన్ ఏమైనా ఉంటే అదిపోతుంది. ఈ రెండింటితో పాటు వ్యాఖ్యానం కూడా జతచేయడంతో విషయానికి సమగ్రత అబ్బినట్లయింది.

ఈ విషయాలతో పాటు రాజ్యాంగ సమీక్షా కమిషన్, అది చేసిన సిఫారసుల గురించి కూడా కొంత చెప్పి ఉంటే పుస్తకానికి మరింత సమగ్రత వచ్చేది. ఈ విషయంపై ఆసక్తి ఉన్న వారికి మరో పుస్తకాన్ని వెతుక్కోవాల్సిన ఇబ్బందీ తప్పేది. ఈ లోపం ఉన్నప్పటికీ పుస్తకం అందరి అవసరాలనూ తీర్చుతుందనడంలో అతిశయోక్తి లేదు.

ఈ విధమైన ప్రత్యేకాంశాలతో సమగ్రమైన విషయాన్ని అందిస్తున్న ఈ పుస్తకం విద్యార్థులకు, న్యాయవాదులకు, సాధారణ పౌరులకు, ఇతరులకు కూడా ఉపయుక్తంగా ఉంటుంది.

- నేలంటి మధు

స్వీకారం

పొరపాట్లు సృష్టించిన అద్భుతాలు
రచన : డా॥బి.జి.వి.నరసింహారావు;
వెల : రు. 30; **ప్రతులకు** : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు



పాలకుర్తి ప్రముఖులు
రచన : శంకరమంచి శ్యాంప్రసాద్;
వెల : రు. 15; **ప్రతులకు** : శంకరమంచి సత్యనారాయణ, ఇ.నెం.2-104, పాలకుర్తి, వరంగల్ జిల్లా

ఐదు దశాబ్దాలుగా నేనూ, నా నాటకరంగమ్
రచన : ఏడిద గోపాలరావు; వెల : రు. 100;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; ఏడిద గోపాలరావు, 105, చాణక్య టవర్స్, లయన్స్ క్లబ్ ఐ హాస్పిటల్ రోడ్, వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.





హైటెక్ సిటీ హైదరాబాద్

నగర శివార్లలో జూబిలీహిల్స్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో మాదాపూర్ వద్ద కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ పరిశ్రమ అభివృద్ధి చెందుతోంది. కంప్యూటర్ పరిశ్రమ కోసం నిర్మించిందే ఫోటోలోని హైటెక్ సిటీ. దీన్నే సైబర్ టవర్స్ అంటున్నారు. చూడటానికి ఎంతో అద్భుతంగా కనిపించే ఈ భారీ నిర్మాణం అతి తక్కువ వ్యవధిలో నిర్మించారు. అందులో వందలాది సాఫ్ట్‌వేర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. దీని నిర్మాణం తర్వాతే రాజధానికి హైటెక్ సిటీ అనే పేరు స్థిరపడింది.

బిర్లా మందిర్



నగరం నడిబొడ్డున అసెంబ్లీ హాల్, రవీంద్రభారతికి సమీపంలో ఒక కొండపై నిర్మించిన వెంకటేశ్వరుని పాలరాతి ఆలయాన్నే బిర్లా మందిర్ అంటున్నారు. దేశంలో ప్రముఖ పారిశ్రామిక కుటుంబం బిర్లాలు దీన్ని నిర్మించడంతో దేవుని పేరుకు బదులుగా దాన్ని నిర్మించిన సంస్థ పేరుతోనే పిలుస్తున్నారు. 20 సం॥ల క్రితం దీని నిర్మాణం పూర్తయింది. ఇందులోని వెంకటేశ్వరుని విగ్రహం తిరుమలలోని వెంకటేశ్వరుని విగ్రహం నమూనాలో ఉంటుంది. పాలరాతి నిర్మాణం కావడాన రాత్రివేళ ఈ ఆలయ సౌందర్యాన్ని చూడవలసిందే గాని చెప్పడం సాధ్యం కాదు. ఈ ఆవరణలోనే బిర్లా సైన్స్ మ్యూజియం, ప్లానిటోరియం కూడా ఉన్నాయి.

హుస్సేన్ సాగర్, ఎన్‌టిఆర్ గార్డెన్

బుద్ధుడు కొలువుతీరిన హుస్సేన్‌సాగర్ చుట్టూ నెక్లెస్‌రోడ్ నిర్మాణంతో జంట నగరాలను కలుపుతూ ఒకవైపు ట్యాంక్‌బండ్, సికింద్రాబాద్ వైపు సంజీవయ్యపార్క్, దానికి ఆనుకుని నెక్లెస్‌రోడ్ పార్క్, ఇటుపక్క లుంబినీ వనం, దానికెదురుగా ఎన్‌టిఆర్ గార్డెన్ అదే ఆవరణలో ప్రసాద్ ఐ మ్యాక్స్ థియేటర్లతో ఈ ప్రాంతమంతా పెద్ద పిక్‌నిక్ ప్రదేశంగా రూపొందింది. ఎన్‌టి రామారావు భౌతికకాయానికి అంత్యక్రియలు జరిగిన ప్రదేశాన్ని ఎన్‌టిఆర్ గార్డెన్‌గా బ్రహ్మాండంగా అభివృద్ధి చేశారు. ఆదివారం, సెలవు రోజుల్లో ఈ ప్రాంతమంతా విపరీతమైన రద్దీగా ఉంటుంది. లోయర్‌ట్యాంక్ బండ్ సమీపంలోని ఇందిరాపార్క్‌ను కూడా ఇటీవల బాగా అభివృద్ధి చేశారు.



పబ్లిక్‌గార్డెన్స్

నాంపల్లి రైల్వేస్టేషన్‌కు అనుకుని సువిశాల ప్రదేశంలోగల పబ్లిక్‌గార్డెన్స్ ఇప్పటికీ వన్నె తరగకుండా ప్రజలను ఆకర్షిస్తోంది. శాసనసభ భవనాల సముదాయం కూడా పబ్లిక్‌గార్డెన్స్‌లో భాగంగానే ఉంది. ఎన్‌టి రామారావు హయాంలో నిర్మించిన తెలుగు లలిత కళాతోరణం భారీగా నిర్వహించే సాంస్కృతిక ఉత్సవాలకు వేదికగా ఉపయోగపడుతోంది. అదొక ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం. పబ్లిక్‌గార్డెన్స్‌లోనే గల స్టేట్ మ్యూజియంలో అత్యంత ప్రాచీనవైన కళాఖండాలు, నాగరికతావశేషాలు ప్రదర్శిస్తారు.

రామోజీ ఫిల్మ్‌సిటీ

విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన నగర శివార్లలో 1500 ఎకరాల్లో నిర్మించిన రామోజీ ఫిల్మ్‌సిటీ ఎగువ మధ్యతరగతి, ఉన్నతాదాయవర్గాల వారికి పెద్ద ఆకర్షణగా ఉంది. ఇందులో సినిమాలు నిర్మించడమే గాకుండా పిక్‌నిక్‌లకు కూడా ప్రజలు వచ్చే విధంగా ఆకర్షణీయ పథకాలను ప్రకటిస్తున్నారు. ఇంకా హైదరాబాద్‌లో నెహ్రూ జంతు ప్రదర్శనశాల, గండిపేట చెరువు, దుర్గం చెరువు, షామీర్‌పేట చెరువు వంటి పర్యాటకులు చూడదగ్గ ప్రదేశాలు అనేకం ఉన్నాయి. ★

రంగస్థల ఫోకస్ లైట్ గరిమెళ్ళ రామ్మూర్తి

"మడిసన్న తర్వాత కూసంత కలాపోసనుండాల" అన్న ముత్యాల ముగ్గు సినిమా డైలాగ్‌ను ఆ తెరవెనుక 'పెద్దమనిషి' చాలా కళాత్మకంగా చెప్పించారు. కాస్తంత కాదు తన నిలువెల్లా కళాపోషణ నింపుకున్న కళామహుడు గరిమెళ్ళ రామ్మూర్తి గారు.

శంకర్

శ్రీకాకుళం జిల్లాలో 1936లో జన్మించి, ఎ.జి.ఆఫీసు ఉద్యోగిగా 1960లో హైదరాబాద్ వచ్చారు. ఆయన కేవలం ఉద్యోగిగానే కాదు అప్పటికే పేరుపొందిన కళాకారుడిగా కూడా హైదరాబాద్ చేరారు. 1957లో విజయనగరంలోని, రాఘవ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన "కుక్కపిల్ల దొరికింది" అనే నాటికలో ఉత్తమ నటుడిగా ఎన్నికయ్యారు. అప్పటి నుండి 'కుక్కపిల్ల రామమూర్తి' అని తన ప్రతిభ గుర్తింపుకి కారణమైన నాటికి పేరు ఇంటిపేరుగా మారింది.

1960ల నాటి ఏ.జి.ఆఫీసు అంతా అధిక సంఖ్య ఉద్యోగులతో కళకళలాడేది.

అప్పుల తిప్పలు

అప్పులు పుట్టవు పుడితే
తప్పదు వడ్డీల మోత తల తాకట్టే
తిప్పలు ఋణదాతలతో
తప్పదు రైతులకు ప్రభుత దాపే తమ్మి!
    పురుగుల మందులు ఎరువులు
    అరయగ మరి విత్తనాలు అంతయు కల్తే
    కరవులు వీటికి తోడై
    బరువయ్యెను రైతు బతుకు పాపము తమ్మి!
సేద్యపు నీటికి వలెనే
విద్యుత్తును నామమాత్ర వెలకే యిచ్చే
బాధ్యత ప్రభుతది కాదా
చోద్యము యేముంది రైతు సుఖమే తమ్మి!
    ఆపన్నులైన.వారిని
    కాపాడుట ప్రభుత విధియె కాదా మరి యీ
    పాపము యెవరిది రైతే
    శాపాగ్నిలో మాడిపోయె శలభము తమ్మి!
బడుగుల వైపే అడుగులు
పడవలె పేదలకు మేలు పాలక విధియే
తడబడక వారి బాధలు
కడతేర్చగ చిత్తశుద్ధి కావలె తమ్మి!
    ఆగవలె ఆత్మహత్యలు
    సాగవలె ప్రభుత్వ కృషియె సాకల్యముగా
    మోగవలె 'రైతు ముంగిట'
    జేగంటలు ఋణవిముక్తి జిలుగులు తమ్మి!

- పొనుగోటి నరసింహారావు

ఇప్పటిలా కంప్యూటర్లతో కాక చేతిరాతతో కాగితంపై రాయడం, ఫైళ్ళ నమోదు, రికార్డు వర్కు వాటిని దాచే ఓ పెద్ద స్టోరు రూమ్ ఆ ఫైళ్ళ మధ్య రాష్ట్రంలోని ఎందరో ఉద్యోగుల, శాఖల ఆర్థిక వ్యవహారాల ఎడతెరిపిలేని వాతావరణం. ఆ వాతావరణంలో గరిమెళ్ళ రామ్మూర్తిగారు తనలోని కళాత్మకతను ఫైళ్ళ ధుమ్మూధూళిలో కొట్టుకుపోనివ్వలేదు. ఆ కార్యాలయంలో, ఆ ఫైళ్ళపై కదలాడే చూపుల్లో, చేతుల్లో కళాకారులున్నారేమో వెదికారు. ఏ.జి.ఆఫీసు, సెక్రటేరియట్, ఆర్ & బి శాఖలు ఇలా అన్ని శాఖలు ఒక్కో నాటక విభాగాలుగా ఓ మంచి కళాత్మక పోటీ వాతావరణం ఉండేది. దానిలో భాగంగా ఏ.జి. ఆఫీసు నాటక బృందం ఉండేది. 'తెలుగు నాటక సమితి' అనే సంస్థను ఏర్పాటు చేయడంతో మొదలై 'రసరంజని' సంస్థ స్థాపన వరకూ అయినొక అలుపెరుగని నాటకోద్యమ కార్యకర్త. ఎక్కడ తెలుగునాటకం ప్రదర్శన జరుగుతున్న ఆ ప్రాంగణంలో కనబడే ఓ పెద్దాయన, ఓ ఆత్మీయుడు. రామ్మూర్తిగారిది బహుపాత్రాభినయం. నాటకరంగ అభిమాని, కార్యకర్త, నటుడు, నిర్వాహకుడు, పోషకుడు, సమన్వయకర్త, సంస్థల స్థాపకుడు, ఉద్యమకారుడు వెరసి గరిమెళ్ళరామ్మూర్తిగారు. వీరి సహచరులు, ఆప్తులు అయిన డి.ఎస్.ఎన్.మూర్తిగారు "తెలుగు నాటకరంగంలో ఓ ఆత్రేయ లాంటి రచయిత పుట్టొచ్చు. గరికపాటి రాజారావు లాంటి దర్శకుడూ పుట్టొచ్చు. కె.వెంకటేశ్వర్రావు లాంటి నటుడు పుట్టొచ్చు. కానీ గరిమెళ్ళ రామ్మూర్తి అంతటి నాటక ఉద్యమకారుడు పుట్టడు" అని తన హృదయ స్పందన తెలియజేశారు.

తెలుగు నాటకరంగాన 'సురభి' నాటక రంగానిది ఓ విలక్షణమైన చరిత్ర. 120 సంవత్సరాల వయస్సున్న సురభిని ఓ నలభై ఏళ్ళ పాటు వెన్నంటి అండగా నిలిచారు. సురభి కళాకారులకు గృహ వసతి కల్పించడం దగ్గరనుంచి, సురభి నాటకానికవసరమయ్యే ప్రత్యేక ఏర్పాట్లు, సదుపాయాల కల్పన వరకూ ఎంతో సహకారం అందించారు. అందేలా చూశారు. కేవలం ఆటల పోటీలు లాంటివి మాత్రమే జరిపే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కమిటీని నాటక పోటీలు ఎందుకు జరపరని అడిగారు. ఒకరకంగా ఒత్తిడి తెచ్చి అధికార్లతో సంప్రదింపులు జరిపి సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ నాటక పోటీలు - ప్రదర్శనలు 1965 సంవత్సరం నుండి జరిగేలా చేశారు. ఆయన కృషి ఇతర రాష్ట్రాల సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్‌క్కూడా మార్గదర్శకం అయ్యింది. 1969లో మొట్టమొదటిసారిగా కేంద్ర ప్రభుత్వోద్యోగుల అఖిల భారత స్థాయి నాటకోత్సవాలు ఢిల్లీలో నిర్వహించబడ్డాయి. ఆ ఉత్సవాలకు తెలుగు నాటకం 'కీర్తిశేషులు' ప్రదర్శించిన గరిమెళ్ళ రామ్మూర్తిగారి టీమ్ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ నటుడు బహుమతులు గెలుచుకుంది. అంతేకాదు 1982లో ఈ గరిమెళ్ళ పూనిక వహించి, అఖిల భారత స్థాయి నాటకోత్సవాలను హైదరాబాద్‌లో నిర్వహించారు. 18 భాషల నాటకాల ప్రదర్శనగా ఓ గొప్ప వేడుకగా జరిగాయని ఇప్పటికీ తమ మరువలేని జ్ఞాపకం హైదరాబాద్ నాటకరంగ ప్రముఖులు చెబుతారు. కేంద్ర ప్రభుత్వోద్యోగుల్లోని కళాకారులందరకూ ఒక 'కామన్ ప్లాట్‌ఫారం' ఏర్పడటం గరిమెళ్ళ వారి కృషే.

1975లో ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో, జంట నగరాల రంగస్థల నిర్మాణంలో రామ్మూర్తి గారెంతో కృషి చేశారు. బోయి భీమన్నగారి దళిత స్పృహతో కూడిన నాటకాలను నృత్య సంగీత భరితాలుగా మలచి రసరమ్య, చైతన్య స్ఫోరక ప్రదర్శనలుగా రూపొందించడం రామ్మూర్తిగారి సామాజిక దృక్పథంలోని విశిష్టమైన గుణం.

అందుకే రామ్మూర్తిగారు ముమ్మూర్తులా కళాపోషకుడు, కళారాధకుడు. నాటకరంగ ఉద్యమ కార్యకర్త. 68వ ఏట జూన్ 3వ తేదీన రంగస్థల కర్టెన్ తాళ్ళను తన తరువాతి తరం వారి చేతులకప్ప జెప్పి నిష్క్రమించారు. అయినా ప్రతీ నాటక ప్రదర్శన యొక్క 'పరబ్రహ్మ...' పద్యం తరువాత నుంచి 'ఇంతటితో ఈ నాటకం సమాప్తం' అనే వరకూ ఆ మధ్యలో లైట్సాన్ అయిన నాటక చరిత్రలో గరిమెళ్ళ రామ్మూర్తి ఓ వెలుగై ఉంటారు. ★

మూగబోయిన పల్లె

చల్లారని మబ్బులు
వేడెక్కడంతోనే
మట్టిని కలగన్న
రోజు కూలీల బతుకులు
నేలకూలిన తాటికొమ్మల్లా మాడిపోతున్నాయి
మంచు కన్నీళ్లను తప్ప
పూతను కనలేని మామిడి తోటలో
ఆశల తోరణాలకు దూరంగా
ముడులుపడ్డ సమస్యల చిక్కువలలో
నైరాశ్యపు బతుకు వెలసిపోతోంది
ఉద్విగ్న క్షణాలన్నీ జీడిపంట కోసం
తడిమి తడిమి కాలాన్ని సాగనంపితే
దళారుల చేతుల్లో దగా స్పర్శ
బోర్లాపడిన జీవితాలకు
వేకువ ఒక కల
సూర్యోదయంతో
పక్షులు ఆకలి వలసకు అతుక్కుపోయినట్టు
మా వెంకట్రావ్ దేశమెల్లిపోయాక
వాడయ్య కొడుకు మీద
కలలు పరిమళించేలోపే కళ్ళు తేలేశాడు
రెక్కలు ఎగరేసుకుని
డబ్బులు మోసుకురావాలని వెళ్ళిన వెంకట్రావ్

కన్నీళ్ళను గోనె సంచులతో మోసుకొచ్చాడు
మునుపెన్నడూ లేనట్లు పల్లె
దీనంగా చూపుల్ని విప్పుకుంది
వలసపోయిన ఈ ఊరు పక్షులతో
పల్లె పుట్టెడు దుఃఖంతో మూగపోయింది
కోరికలు ఎగురుతున్నా
దేహాల్ని మట్టిబంధాలకి కట్టేసి
ఏ వైపూ కదల్లేని మధ్య తరగతి బతుకు
చూపులను ఉరికంబాలకు వేలాడిస్తూ
గిట్టుబాటులేని మిరపకాయల ధరల మధ్య
సందిగ్ధంగా సాగిలపడింది
పత్తి పువ్వుల్ని కలగని
అప్పులోయల్లో ఈదలేనప్పుడు
బతుకుకన్నా ఖరీదైన పురుగుమందులే
మనుగడను శాసిస్తున్నాయి
కలల చిగురుల్ని నులిమేస్తే
రేపటి మొగ్గలకు ఆశ ఏదీ?

- గవిడి శ్రీనివాస్

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

కేసు వేయాలంటే ఎలా?

ఐదు జిల్లాలకు కేంద్రంగా వరంగల్‌లో 1999 సంవత్సరంలో ఎ.పి.ఎస్.ఇ.బి. వారు ఉద్యోగాలకు చివరిసారి ఇంటర్వ్యూ నిర్వహించారు. కరీంనగర్ జిల్లాకు ఐదు పేర్లు చూపుతూ పది రోజులలో వీరి జెనూను పంపమని ఆయా అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ ఆదేశాల పట్ల నిర్లక్ష్యం వహించిన ఎన్.పి.డి.సి.ఎల్. ఆపరేషన్/కరీంనగర్ పై హైకోర్టుకు వెళ్ళి మూడు నెలల్లో ఇతని జెనూను చూచి ఉద్యోగం ఇవ్వమని ఇచ్చిన తీర్పుకు, నీకు రిక్రూట్‌మెంట్ లేదు అని ఎస్.ఇ. ఆఫీసు నుండి ఒక లెటర్ వచ్చింది.

నా ఇంటర్వ్యూ టైంలో రిక్రూట్‌మెంట్ అర్హత లేకుంటే నా జెనూను ఎందుకు అడుగుతారు అని రెండవసారి హైకోర్టుకు వెళ్ళాను. అప్పుడు నీకు ఐ.టి.ఐ. లేదు అంటూ నీకు ఇచ్చిన టైంకు నీ జెనూను అంది ఉంటే అంటూ ఎ.పి.ఎస్.పి.డి.సి.యల్. ఆపరేషన్/కరీంనగర్, వరంగల్ వారి నిబంధనలో ఒక్కటైన ఐ.టి.ఐ.ని సమర్థించుతూ, మళ్ళీ ఎస్.ఇ. ఆఫీసు పై కేసు వేయాలంటే ఎలా, దయచేసి నా సమస్యకు పరిష్కారం చూపగలరు. నా ఎంగేజ్‌మెంట్ ప్రకారం తీర్పు రాలేదు. ఏం చేయాలి.

– రాపెల్లి బుచ్చయ్య, జగిత్యాల, కరీంనగర్ జిల్లా

బుచ్చయ్యగారూ! మీరు పంపించిన అన్ని కాగితాలు పరిశీలించిన మీదట మీరు ముందుగా 50 శాతం కాంట్రాక్ట్ బేసిస్ కోటా కింద అబ్‌సార్షన్ కోసం వేచి వున్నారు. ఎన్ని రోజులకు వారు రిక్రూట్‌మెంట్ గురించి పరిశీలించడం లేదని హైకోర్టులో రిట్‌పిటిషన్ వేశారు. దాంతో మీతోపాటు అప్లయ్ చేసుకున్న అందరి కాగితాలు పరిశీలించిన మీదట మీకు ఐ.టి.ఐ. లేదని తిరస్కరించింది. మీరు మళ్ళీ కోర్టు ధిక్కారపు కేసును హైకోర్టులో ఫైలు చేశారు.

మీకు అన్ని అర్హతలు లేవు కాబట్టి మీకు డిపార్టుమెంటు వారు ఉద్యోగం ఇవ్వలేదు. కావున వారి మీద మాత్రం కోర్టు ధిక్కారం లేదు అని మీ కేసు కొట్టివేయడం జరిగింది. మిగతావారిని మాత్రం రిక్రూట్ చేసుకుంది. మీరు ఇంకా ఏ కేసు వేయలేదు. ఐ.టి.ఐ. అర్హత లేనందున మీకు ఈ ఉద్యోగం రాలేదు. మిగతా వారిలో ఎవరికైనా ఐ.టి.ఐ. అర్హత లేకుండా ఉద్యోగం ఇచ్చి ఉంటే అప్పుడు మీరు కేసు వేసి మీకూ ఉద్యోగం ఇవ్వమని అడగవచ్చు.

న్యాయం జరుగుతుందా?

నేను వ్యవసాయ అధికారిగా, పనుగలూరు మండలం, కడపజిల్లాలో పని చేసినప్పుడు తుంపర్ల సేద్యం పనిముట్లు రాయితీపై 1998-99 సంవత్సరంలో పంపిణీలో అవకతవకలు జరిగాయని వ్యవసాయ శాఖ కమిషనర్ నన్ను 1-6-1999న సస్పెండ్ చేశారు. సదరు ఉత్తర్వులు సరికాదని, అన్యాకృతమని, న్యాయం కాదని, సహజ న్యాయమునకు వ్యతిరేకమని నేను, నా తోటి సహోదరులము ఎ.పి.అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, హైదరాబాద్‌లో 2-6-1999న కేసి వేశాము. ఇరుపక్కల కేసు విచారణ చేసి అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, హైదరాబాద్ వారు వ్యవసాయ శాఖ కమిషనర్ హైదరాబాద్ వారికి మీరు ఈ తాఖీదు అందిన 40 రోజుల లోపు విచారణ జరిపి తగిన చర్య లేక వారిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకోమన్నారు. వ్యవసాయ శాఖ కమిషనర్, హైదరాబాద్ వారు ఎలాంటి ఎంక్వయిరీ చేయకనే తిరిగి ఉద్యోగంలోకి (1-6-1999 నుండి 16-8-2000) 77 రోజుల తర్వాత తీసుకొన్నారు. నాకు ఒక ఇంక్రిమెంట్ కుమ్యులేటివ్ ఎఫెక్ట్ లేకుండా ఆపుదల చేసి వున్నారు. సస్పెండ్ పీరియడ్ ఎరన్‌లీవ్స్‌గా చేసిన తదుపరి ఇచ్చి వున్నారు. ఈ కాలంలో నా జూనియర్ ఏ.ఓ.కు ఎ.డి.ఏ.గా ప్రమోషన్ ఇచ్చి వున్నారు. పై కారణాల వలన కార్యాలయ లోపము వలన జరిగి నాకు ప్రమోషన్ ఆగినది. కోర్టు ఉత్తర్వులు ధిక్కరించిన అధికారిపై ఎ.పి. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ లేక హైకోర్టులో కేసు నేను వేయవచ్చునా. నాకు న్యాయం జరుగుతుందా? దయచేసి తెలియచేయవలసిందిగా కోరుతున్నాను.

– కె.గాంధీ,

అవకతవకలు జరిగాయని పై అధికారి సవివరమైన విచారణ లేకుండానే చర్య తీసుకొన్నారని మీరు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. వాళ్ళు మిమ్మల్ని తిరిగి ఉద్యోగంలోకి తీసుకొన్నారు. మీకు ఇంక్రిమెంట్ కట్ చేసినందుకు, ప్రమోషన్‌లో జరిగిన ఆలస్యానికి మీరు మరల ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి మీపై ఏ నేరం రుజువు కాలేదని, నిరూపించుకుంటూ ప్రమోషన్‌ను కోరవచ్చు.

రుచి

పెరుగు గారెలు

కావలసిన వస్తువులు:

మినపప్పు	:	అరకిలో
ఉప్పు	:	తగినంత
పసుపు	:	అరస్పూన్
ఆవాలు	:	ఒకస్పూన్
ఉల్లిపాయ	:	ఒకటి
నూనె	:	అరకిలో
పెరుగు	:	ఒక లీటర్
కరివేపాకు	:	రెండు రెబ్బలు
కారం	:	అరస్పూన్
పచ్చిమిర్చి	:	ఒకటి

తయారుచేసే విధానం:

మినపప్పు రెండు గంటలు ముందుగా నీళ్ళు పోసి నానబెట్టాలి. నానిన తరువాత శుభ్రంగా కడగాలి. వీటిని నీళ్ళు ఎక్కువ వేయకుండా మెత్తగా రుబ్బుకోవాలి. ఉల్లిపాయ, పచ్చిమిర్చి సన్నగా తరగాలి. పెరుగులో పసుపు, ఉప్పు, కారం కలపాలి. పొయ్యి మీద గిన్నెలో కొంచెం నూనె పోసి కాగనివ్వాలి. అందులో ఆవాలు, కరివేపాకు వేసి తాలింపు వేయాలి. పెరుగు పోసి ఒక నిముషం ఉంచాలి. ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు కూడా తాలింపులో వేగనివ్వాలి. పొయ్యి మీద బాండీలో నూనె పోసి కాగిన తరువాత గారెలు చేసి నూనెలో వేయాలి. నూనెలో వేగిన తరువాత తీసి చన్నీళ్ళలో వేసి పెరుగులో వేయాలి. రెండు గంటలు నానిన తరువాత ఈ పెరుగు ఆవడ తినవచ్చు.

డబుల్ కా మీఠా

కావలసిన వస్తువులు:

మిల్క్ బ్రెడ్ ప్యాకెట్	:	పెద్దది
పంచదార	:	అరకిలో
డాల్డా లేక నెయ్యి	:	వంద గ్రాములు
నూనె	:	కొంచెం
యాలుక్కాయలు	:	నాలుగు
జీడిపప్పు	:	25 గ్రాములు
కిస్మిస్	:	25 గ్రాములు

తయారుచేసే విధానం:

బ్రెడ్ ముక్కలను అరగంట సేపు ఎండబెట్టాలి. తరువాత వాటిని చిన్న ముక్కలుగా చేసి నూనెలో వేయించాలి. పంచదారను లేత పాకం పట్టాలి. వేయించిన బ్రెడ్ ముక్కల్ని ఆ పాకంలో వేసి పది నిముషాల తరువాత అందులో డాల్డా లేక నెయ్యి వేసి గ్యాస్ మీద పెట్టి కొంచెం సేపుంచి దించాలి. తరువాత వేయించిన జీడిపప్పు, కిస్మిస్, యాలకుల పొడి వేసి కలపాలి. ఇది చాలా రుచిగా ఉంటుంది.

– ఇ. శేషు కుమారి
హైదరాబాద్

SRI GOWTHAMI

సెలవులు

అయిపోయాయ్!

2004 విద్యా సం. అడ్మిషన్లు ప్రారంభం

నర్సరీ నుండి 10వ తరగతి వరకు

SGPS

శ్రీ గౌతమి

పబ్లిక్ స్కూల్

బాలబాలికలకు విడివిడిగా హాస్టల్ వసతి కలదు

L.K.G. to X Class (E.M.)

(Recognised by the Govt. of A.P.)

రాజమండ్రి-3

ఫోన్స్ : 2463533, 2400625.